నవతెలంగాణ
మహబూబ్‌నగర్
బుధవారం | జూలై 31, 2024 | www.navatelangana.com

పోలీసులు అందుబాటులో ఉండాలి : ఎస్పీ



బాలానగర్/ రాజాపూర్ : రాత్రి పగలు అనే తేడా లేకుండా పోలీసులు ప్రజలకు అందుబాటులో ఉండాలని.. శాంతి భద్రతల పట్ల నిర్లక్ష్యం చేయ రాదని మహబూబ్ నగర్ జిల్లా ఎస్ పీ డీ. జానకి అన్నారు. మంగ ళవారం వార్షిక తనిఖీలో భాగంగా రాజాపూర్ పోలీస్ స్టేషన్ ను జడ్చర్ల రూరల్ సీఐ మల్లికార్జునగౌడ్ తో కలిసి ఆమె సందర్శించారు. పోలీస్ స్టేషన్‌కు సంబంధించిన అన్ని రికార్డులను పరిశీలించారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ.. పోలీసులు విధుల పట్ల నిర్లక్ష్యం వహించరాదని , ఎప్పుడు ఏ ఫోన్ కాల్ వచ్చినా ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. పోలీస్ స్టేషన్ ఆవరణలో నాటిన మొక్కలు .. పోలీస్ స్టేషన్ పరిశుభ్రత పచ్చదనంతో ఉండడంతో స్థానిక ఎస్ఐ రవినాయక్, పోలీసు సిబ్బందిని అభినందించారు.

జాతీయస్థాయికి ఎదగాలి

- వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ జి. సత్య నారాయణగౌడ్



నవ తెలంగాణ - మహబూబ్ నగర్

క్రికెట్ లో జాతీయస్థాయికి ఎదగాలని ఎంవీఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ జి. సత్య నారాయణగౌడ్, ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ కె.సత్యభాస్కర్ రెడ్డి అన్నారు. గత నెల 26 నుంచి 30 వరకు నేపాల్ దేశం పోఖ్రాలోగల రంగసాల స్టేడియంలో ఖేలో భారత్ యూత్ గేమ్స్ ఫెడరేషన్ ఇండియా ఇంటర్నేషనల్ చాంపియన్ షిప్ క్రికెట్ పోటీల్లో పాల్గొన్న కళాశాలలో బీఏ మొదటి సంవత్సరం చదువుతున్న ఎండీ. అద్నానుద్దీన్‌ను మంగళవారం ఘనంగా సన్మానం చేశారు. ఈ సందర్భంగా వారు విద్యార్థిని అభినందించారు. నేపాల్ లో జరిగిన క్రికెట్ టోర్నీలో కళాశాల విద్యార్థి పాల్గొనడం సంతోషంగా ఉందన్నారు. ఇదే స్ఫూర్తితో భవిష్యత్తులో క్రికెట్లో ఉన్నతస్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో ప్రతిభ చాటాలని కోరారు. ఈ కార్యక్రమంలో లెక్చరర్లు డాక్టర్ రాములు, డాక్టర్ నర్సింలు, డాక్టర్ వెంకటేశ్, మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు.

అక్రమ అరెస్టులను ఖండించండి : సీఐటీయూ



నవ తెలంగాణ - మహబూబ్ నగర్

హక్కుల కోసం పోరాటం చేస్తున్న ఆశా, గ్రామపంచాయతీ కార్మికుల అక్రమ అరెస్టులను ఖండించాలని సీఐటీయూ నాయకులు ప్రజాస్వామ్య వాదులకు విజ్ఞప్తి చేశారు. మంగళవారం చలో హైదరాబాద్‌కు వెళ్తున్న ఆశా కార్మికులను, గ్రామపంచాయతీ కార్మికులను అక్రమ అరెస్టులకు పాల్పడడానికి సీఐటీయూ మహబూబ్ నగర్ జిల్లా కమిటీ తీవ్రంగా ఖండించింది. గత 20 రోజుల ముందుగానే రాష్ట్ర ప్రభుత్వ అనుమతితోనే గ్రామపంచాయతీ కార్మికుల పెండింగ్ వేతనాలు చెల్లించాలని, మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేయాలని, కనీస వేతనాలు అమలు పరచాలని, ఆశా కార్మికులు పారితో షికాలు వద్దు .. కనీస వేతనాలు చెల్లించాలని, జాబ్ చార్ట్ విడుదల చేయా లని, సంబంధం లేని పనులు చేయించరాదని, కాంగ్రెస్ పార్టీ తన మేనిఫెస్టోలో పెట్టిన విధంగా రూ.18000 వేతనం చెల్లించాలని డిమాండ్ చేస్తూ ఆశలు, గ్రామపంచాయతీ కార్మికులు చలో హైదరాబాద్‌కు వెళుతుండగా జిల్లాలో ఎక్కడికక్కడ ఆయా పోలీస్ స్టేషన్లో ఆశ, గ్రామపంచాయతీ కార్మికులను అక్రమంగా నిర్బంధించడాన్ని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నల్లవెల్లి కురుమూర్తి ,సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు కిల్లె గోపాల్ తీవ్రంగా ఖండించారు. కార్మికులను వెళ్లకుండా బస్సులను తనిఖీ చేయడం, రైల్లను తనిఖీ చేయడం , ప్రైవేట్ వెహికల్స్ కూడా వెళ్లకుండా నిర్బంధి ంచడం, అరెస్టులకు పాల్పడడం కాంగ్రెస్ ప్రభుత్వానికి తగదన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ నియంతృత్వానికి వ్యతిరేకంగా పోరాడిన కార్మికులు బీఆర్ఎస్ ను గద్దె దింపి కాంగ్రెస్ ప్రభుత్వానికి పట్టం కడితే అదే పద్ధతి తో ఈ ప్రభుత్వం కూడా వ్యవహరిస్తుందని విమర్శించారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం స్కీంలన్నిటిని ప్రైవేటీకరించడానికి స్వచ్ఛంద సంస్థలకు అప్పజెప్పడానికి మోడీ ప్రభుత్వం ప్రయత్నిస్తుందని దానికి వ్యతిరేకంగా ఆందోళన పోరాటాలకు కాంగ్రెస్ పార్టీ మద్దతు ఇవ్వకుండా, బీజేపీ అడుగులోనే కాంగ్రెస్ పార్టీ అడుగులు వేస్తుందని విమర్శించారు. మహబూబ్ నగర్ టూ టౌన్ , వన్ టౌన్ రూరల్ , అన్ని పోలీస్ స్టేషన్లో వందలాది మంది ఆశాలను గ్రామ పంచాయతీ మున్సిపల్ కార్మికులను అరెస్టులు చేయడాన్ని వారు తీవ్రంగా ఖండించారు. తక్షణమే రాష్ట్ర ప్రభుత్వ స్పందించి గ్రామపంచాయతీ కార్మికులకు కనీస వేతనాలు అమలు పరచాలని. మల్టీపర్పస్ విధానాన్ని రద్దు పరచాలని. ఆశా కార్మికులకు కనీస వేతనం రూ. 18000 ఇవ్వాలని, రిటైర్మెంట్ బెనిఫిట్ ఐదు లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేనిచో మరిన్ని పోరాటాలకు ఆశా, గ్రామపంచాయతీ కార్మికులు సిద్ధమవుతారని హెచ్చ రించారు. సీఐటీయూ జిల్లా కోశాధికారి చంద్రకాంత్, పట్టణసీఐటీయూ నాయకులు రాజకుమార్ ,జ్యోతి కమల, రాధా, నర్సమ్మ ,యాదమ్మ, పద్మ , ఏరా నరసింహులు, వెంకటరావు, విశ్వనాథం, చెన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

పండుగలా.. రెండో విడుత..

- కలెక్టరేట్‌లో రైతులకు లాంఛనంగా చెక్కుల అందజేత
- రుణ మాఫీ పొందిన రైతాంగానికి శుభాకాంక్షలు : కలెక్టర్

రైతు రుణమాఫీ నిధులు విడుదల

నవ తెలంగాణ - మహబూబ్ నగర్

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న రైతు రుణమాఫీ-2024 రెండవ విడత నిధుల విడుదల కార్యక్రమం మంగళవారం పండుగ వాతావరణంలో అట్టహాసంగా నిర్వహించారు.రాష్ట్ర ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి రాష్ట్ర శాసన సభ ప్రాంగణం నుంచి రాష్ట్ర ఉప ముఖ్య మంత్రి మల్లు భట్టి విక్రమార్క, శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్, శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి,రాష్ట్ర వ్యవసాయ శాఖా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఇతర మంత్రులు, ఉన్నతాధికారులతో కలిసి రెండవ విడత లక్షన్నర వరకు రుణమాఫీ నిధులను విడుదల చేయగా, సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం (కలెక్టరేట్) లోని ప్రధాన సమావేశ మందిరంలో కలెక్టర్ విజయేందిర బోయి అధ్యక్షతన లబ్దిదారులైన రైతులు, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్,రెవెన్యూ అదనపు కలెక్టర్ ఎస్ .మోహన్ రావు, మహబూబ్ నగర్ మున్సిపల్ చైర్మన్ ఆనంద్ గౌడ్, వ్యవసాయ సహకార శాఖల అధికారులు, బ్యాంకర్లు, సహకార సంఘాల చైర్మన్లు, స్థానిక ప్రజా ప్రతి నిధులు ప్రత్యక్ష ప్రసారం ద్వారా ఈ కార్యక్రమాన్ని వీక్షించి, ముఖ్యమంత్రి సందేశాన్ని తిలకించారు. జిల్లాలోని మండల లలోని రైతు వేదికలలోనూ రుణ మాఫీ రెండవ విడత నిధుల విడుదల కార్యక్రమం కొనసాగగా, ఎక్కడికక్కడ రైతు లు ఉత్సాహంగా పాల్గొని తమ హర్షాతిరేకాలు వెలి బుచ్చారు. ఒకే పంటకాలంలో రూ. రెండు లక్షల వరకు పంట రుణాలు మాఫీ చేస్తుండడం పట్ల రైతులు సంతోషం వ్యక్తం చేస్తూ, ప్రభుత్వానికి,రాష్ట్ర ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలిపారు.ఈ సందర్భంగా స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి లబ్దిదారులైన పలువురు రైతులకు రెండవ విడత రుణమాఫీకి సంబంధించిన నమూనా చెక్కును లాంఛనంగా అందజేశారు. రైతులను ఉద్దేశించి కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రుణమాఫీ ద్వారా రైతుల ఖాతాలలో రూ. 31 వేల కోట్లు జమ చేస్తోందని అన్నారు. ఇందులో భాగంగా మొదటి విడతగా ఈ నెల 18న లక్ష రూపాయల లోపు రుణాలను మాఫీ చేయగా, రెండవ విడత మంగళవారం లక్షా 50 వేల రూపాయల లోపు రుణాలను మాఫీ చేస్తూ నిధులు విడుదల చేసిందన్నారు. రుణమాఫీ ద్వారా జిల్లాలో మొదటి విడతలో 35108 మంది రైతు కుటుంబాలకు రూ. 194.47 కోట్ల మేర లబ్ది చేకూర్చగా, మలివిడతలో 21589 మంది రైతు కుటుంబాలకు రూ. 215.44 కోట్ల నిధులను వారి ఖాతాలలో ప్రభుత్వం జమ చేసిందని వివరించారు. రైతు సంక్షేమం పరమావధిగా ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న రుణమాఫీ కార్యక్రమం జిల్లాలో ఎలాంటి ఆటంకాలు లేకుండా సాఫీగా జరిగేలా అధికార యంత్రాంగం తరపున అవసరమైన అన్ని చర్యలు తీసుకున్నామని తెలిపారు. రుణమాఫీ ద్వారా అర్హులైన ప్రతి రైతు ప్రయోజనం పొందేలా బ్యాంకర్లు, వ్యవసాయ అధికారులు అన్నదాతలకు తోడ్పాటును అందిం చాలని ఆదేశించారు. ఏ ఒక్క రైతు అసౌకర్యానికి గురికా కుండా చూడాల్సిన బాధ్యత క్షేత్రస్థాయి అధికారులదేనని స్పష్టం చేశారు. ప్రస్తుతం ప్రభుత్వం విడుదల చేసిన రెండవ విడత రుణమాఫీ నిధులను రైతుల ఖాతాలలో అందుబాటులో ఉండేలా చూడాలని, వారు తమ అవసరాల కోసం ఆ నిధులను వినియోగించుకునేవిధంగా చొరవ చూపాలని బ్యాంకర్లకు సూచించారు. తొలి, రెండవ విడత లలో రుణమాఫీ పొందిన రైతులందరికీ జిల్లా యంత్రాంగం తరపున కలెక్టర్ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి వెంకటేష్, జిల్లా సహకారశాఖ అధికారిణి పద్మ, లీడ్ బ్యాంకు మేనేజర్ భాస్కర్,సంబంధిత శాఖల అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.



రుణమాఫీ డబ్బులు రైతులకు చెల్లించాలి..

ప్రభుత్వం రైతులకు చేసిన రుణమాఫీ డబ్బులు వెంటనే రైతులకు చెల్లించాలని కలెక్టర్ విజయేందిర బోయి బ్యాంకర్లను ఆదేశించింది. మంగళ వారం రెండో విడత రైతు రుణ మాఫీ విడుదల సందర్భంగా కలెక్టరేట్ సమావేశ మందిరంలో బ్యాంక్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రైతు రుణ మాఫీ రెండవ విడత లో బాగంగా జిల్లా వ్యాప్తంగా 21,589 రైతుల ఖాతాల్లో రూ 215. 44 కోట్లు జమ అవుతాయని తెలిపారు. ఈ పథకం ద్వారా చాలా కుటుంబాలు రుణ విముక్తులు అవుతారని చెప్పారు. ఇట్టి రైతులకు వెంటనే కొత్త రుణాలు ఇచ్చి వారికి పంట పెట్టుబడి కి సహాయం చేయాలని బ్యాంక్ అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా తొలి విడుత లో రుణ మాఫీ డబ్బులు వచ్చిన రుణ ఖాతాల రెన్యువల్ యొక్క పరిస్థితిని సమీక్షించారు. రెన్యువల్ ప్రక్రియ మందకొడి గా ఉందని, రెన్యువల్ ప్రక్రియ వేగవంతం చేయాలని ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న మరో ప్రతిష్టాత్మక కార్యక్రమం ఇందిరమ్మ మహిళా శక్తి కి చెందిన అన్ని పథకాలకు రుణాలు అంద చేయాలని కలెక్టర్ బ్యాంక్ అధికారులను ఆదేశించారు. అలాగే సబ్సిడీ వచ్చిన షెడ్యూల్ తెగల లబ్దిదారులకు బ్యాంక్ రుణాలు మంజూరు చేయా లని కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్ ఎల్.డి.ఎం కల్వ భాస్కర్, డి.అర్.డి.ఓ నర్సింహులు , బ్యాంక్ అధికారులు శ్రీమతి నర్మద, రవి కిషోర్ రెడ్డి, మురళి కృష్ణ, ప్రసాద్ పాత్రో , అన్ని బ్యాంకుల కంట్రోలర్ లు, బ్యాంక్ మేనేజర్ లు పాల్గొన్నారు.





కాంగ్రెస్ ప్రజా పాలనపై..
ప్రజల్లో నమ్మకం పెరిగింది

- తెలంగాణ రాష్ట్ర మైనార్టీ కార్పొరేషన్ చైర్మన్ కొత్వాల్



నవ తెలంగాణ - మహబూబ్ నగర్

తెలంగాణ రాష్ట్రంలో అధికారంలోకి వచ్చి ఏడు నెలలలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీసుకుంటున్న నిర్ణయాలతో కాంగ్రెస్ ప్రజా పాలనపై ప్రజలలో నమ్మకం పెరిగిందని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మైనారిటీ కార్పొరేషన్ చైర్మన్ ఓబేదుల్లా కొత్వాల్ అన్నారు. మంగళవారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికలలో ఇచ్చిన అన్ని హామీలను అతి తక్కువ సమయంలో అమలు చేసిన చరిత్ర కాంగ్రెస్ పార్టీకి దక్కుతుందని తెలిపారు. ఈ రాష్ట్రంలో ప్రధానంగా కాంగ్రెస్ పార్టీ వ్యవసాయ రంగానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నదనడానికి రైతు రుణమాఫీ నిదర్శనం అన్నారు. లక్షల్లో పు రుణం మాఫీ అమలు చేసిన వారంలోని మంగళవారం రూ.1.50 వేల రుణమాఫీ చేసినట్లు వెల్లడించారు. గత బీ.ఆర్.ఎస్ ప్రభుత్వం రూ.7 లక్షల కోట్లు అప్పుచేసి రాష్ట్రాన్ని అప్పజెప్పిన రైతుల సంక్షేమమే ధ్యేయంగా ఇంత పెద్ద నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు. పది సంవత్సరాల బీఆర్ఎస్ పాలనకు 7 నెలల కాంగ్రెస్ ప్రజా పాలనకు మధ్య ఉన్న తేడాను ఈ రాష్ట్రంలోని అన్ని వర్గాల వారు ఆలోచించి అభినందనలు తెలుపుతున్నారని అన్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా తాగు, సాగునీరు, విద్య వైద్యం రంగాలకు అధిక నిధులు కేటాయించి అభివృద్ధి వైపు అడుగులు వేస్తున్నట్లు వెల్లడించారు. బీఆర్ఎస్ ప్రజల అభిప్రాయాలను పరిగణలోకి తీసుకోకుండా ప్రజా దర్బార్ పాలన చేస్తే కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా పాలన చేసి ప్రజల మనలను పొందుతుందని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఎన్ పీ. వెంకటేష్ మాట్లాడుతూ ఎన్నికల్లో హామీ ఇచ్చాం అమలు నెరవేర్చామని తెలిపారు . రెండో దఫలో ఏడు లక్షల రైతులకు రూ. 6.500 కోట్ల రుణమాఫీ చేసినట్లు వెల్లడించారు. ఈసమావేశంలో మీడియా సెల్ కన్వీనర్ సిజె బెనహర్, బెక్కరి అనిత, సత్తూర్ చంద్రశేఖర్‌గౌడ్,గంజిఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

ఆశలపల్లకీలో .. హస్తం నేతలు

- నామినేటెడ్ పదవుల కోసం నేతల ఆరాటం
- ఎమ్మెల్యేల అభయం ఎవరికో. ?
- నామినేటెడ్ పదవుల విషయంలో ఎమ్మెల్యేల మధ్య భేదాభిప్రాయాలు ..?
- నాయకుల చుట్టూ ఆశవాహుల చక్కర్లు



నవ తెలంగాణ - మహబూబ్ నగర్

ఆశల పల్లకీలో హస్తం నేతలు ఊరేగుతున్నారు. పది సంవత్సరాలుగా పదవులు లేక డీలపడ్డ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఒక్కసారిగా రాష్ట్రంలో పార్టీ అధికారంలోకి రావడంతో తమకు మంచి రోజులు వచ్చాయని... త్వరలో తమకు పదవులు వస్తాయన్న కొత్త ఆశలతో ముందుకు సాగుతున్నారు.కాంగ్రెస్ పార్టీ కష్టకాలంలో ఉన్న సమయంలో పార్టీకి అండగా నిలిచి ప్రజల తరపున పోరాటం చేసిన పలువురు పార్టీ నాయకులు కార్యకర్తలు ఈ ప్రభుత్వ నామినేటెడ్ పోస్టుల కోసం ఆశగా ఎదురు చూస్తున్నారు. గత అసెంబ్లీ ఎన్నికలలో కాంగ్రెస్ అభ్యర్థుల గెలుపు కోసం కృషి చేసిన పార్టీ నేతలు నామినేటెడ్ పదవుల కోసం ఎదురు చూస్తున్నారు. మహబూబ్ నగర్ జిల్లాలో మహబూబ్ నగర్ దేవరకద్ర జడ్చర్ల నియోజకవర్గాల లోని డీటీఎస్ శ్రేణి నేతలు నామినేటెడ్ పదవుల కోసం ఎమ్మెల్యేల ఆశీర్వాదం కోసం వారి చుట్టూ చక్కర్లు కొడుతున్నారు. రాష్ట్రస్థాయిలో ఉన్న వివిధ కార్పొరేషన్ల చైర్మన్ ల కోసం, జిల్లాలో గ్రంథాలయ సంస్థ చైర్మన్, మహబూబ్ నగర్, దేవరకద్ర, జడ్చర్ల మార్కెట్ కమిటీల చైర్మన్లు, మూడు నియోజకవర్గాలను కలుపుతూ ఉన్న మూడ చైర్మన్ రెండవ స్థాయి నేతలు ఎవరికి వారిగా పైరవీలు మొదలుపెట్టారు. ఇప్పటికే జిల్లా కేంద్రంలోని వల్లే బాయ్ పటేల్ మార్కెట్ కమిటీ చైర్మన్ పార్టీలో సీనియర్ గా చెప్పుకుని ఓ మహిళా నేతకు దాదాపు ఖరారైనట్లు పార్టీ నాయకుల్లో చర్చ జరుగుతోంది. దేవరకద్ర, జడ్చర్ల మార్కెట్ కమిటీల కాలమార్మిటి ఇంకా ఉండడంతో నేతలు వేగంగా పైరవీలు మొదలు పెట్టడం లేదు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కోసం మహబూబ్ నగర్ నియోజకవర్గానికి చెందిన ఓ నాయకుడి కోసం దేవరకద్ర , మహబూబ్‌నగర్ శాసనసభ్యులు సంతకాలు చేసి దేవరకద్ర శాసనసభ్యులు దగ్గరకి పంపిస్తే వారు తిరస్కరించినట్లు నాయకులు చర్చించుకుంటున్నారు. ఇద్దరు ఎమ్మెల్యే సంతకాలతో కూడిన ఉత్తరమును రాష్ట్ర ముఖ్యమంత్రి కి అందించినట్లు కొందరు నాయకులు చెప్పుకుంటున్నారు. జిల్లాలోని మూడు నియోజకవర్గాలను కలుపుతూ అతిపెద్ద మూడా చైర్మన్ పదవి కోసం ముగ్గురు ఎమ్మెల్యేల మధ్య బేధాభిప్రాయాలు వచ్చినట్లు దీని పరిష్కారం కోసం ముఖ్యమంత్రి దగ్గరికి వెళ్లినట్లు చర్చ జరుగుతోంది. ఉన్న ముగ్గురు ఎమ్మెల్యేలు రెడ్డి సామాజిక వర్గానికి చెందిన వారు ఉండడంతో జడ్చర్ల శాసనసభ్యులు నామినేటెడ్ పదవులు బీసీలకే ఇవ్వాలనే డిమాండ్ ముందుకు తెచ్చినట్లు పలువురు నాయకులు చర్చించుకుంటున్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి, మంత్రివర్గం పార్టీని నమ్ముకొని ఎక్కువ కాలం ఉన్న నాయకులతో వెంటనే నామినేటెడ్ పదవులు భర్తీ చేయమని చెప్పినప్పటికీ జిల్లాల్లో ఏకాభిప్రాయం కొరవడి పదవులు కేటాయించడంలో ఆలస్యం జరుగుతోందనే చర్చ. ఇక రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్ర అధ్యక్షుడితో పాటు జిల్లా అధ్యక్షులను కొత్తగా నియమించే అవకాశం ఉండడంతో ఇప్పటి నుంచే జిల్లా అధ్యక్ష పదవి కోసం సీనియర్ జూనియర్ నాయకులు ఎవరికి వారు ఎమ్మెల్యేలను రాష్ట్ర నాయకులను మచ్చిక చేసుకునేందుకు జోరుగా ప్రయత్నాలు జరుగుతున్నాయి. పది సంవత్సరాల తర్వాత అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీలో నామినేటెడ్ పదవులు ఎవరికి వస్తాయో అని అందరూ ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. స్థానిక సంస్థల ఎన్నికలు అక్టోబర్ సెప్టెంబర్ నెలలో నిర్వహించే ఆలోచనతో రాష్ట్ర ప్రభుత్వం ఉన్నట్లు తెలుస్తోంది. అంతలోపే ఈ నామినేటెడ్ పదవులు భర్తీ చేస్తారా .. మరింత ఆలస్యం అవుతుందో నామినేటెడ్ పదవులకు ఎప్పుడు శుభం కార్డు పడుతుందో తెలుసుకునేందుకు కొన్ని రోజులు ఆగాల్సిందే.

ఒక్క సీసీ కెమెరా వందమందితో సమానం

- రూ. 36లక్షల చోరీ కేసులో నిందితుల అరెస్ట్
- అప్రమత్తతో ఉంటేనే నేరాలు అరికట్టగలం
- జిల్లా ఎస్పీ జానకి



నవ తెలంగాణ - జడ్చర్ల

ఒక్క సీసీ కెమెరా వంద మందితో సమానం అని జిల్లా ఎస్పీ జానకి అన్నారు. మంగళ వారం జడ్చర్ల పోలీసు స్టేషన్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రూ.36 లక్షల దొంగతనానికి సంబంధించిన వివరాలను ఆమె వెల్లడించారు. ఈ నెల 16 వ తేదీన హైదరాబాద్ కు చెందిన దామోదర్ పికెట్ డిపో కు చెందిన ఆర్టీసీ బస్సులో కర్నూల్ వెళ్తుండగా జడ్చర్ల కొత్త బస్టాండ్ దగ్గర తన బ్యాగులో ఉన్న దాదాపు రూ.36 లక్షలను గుర్తు తెలియని వ్యక్తులు దొంగిలించారనీ ఫిర్యాదు చేశారు. దీంతో సీఐ ఆదిరెడ్డి, రూరల్ సీఐ నాగార్జున గౌడ్‌తో పాటు మరో రెండు టీం లను ఏర్పాటు చేసి విచారణ ప్రారంభించినట్లు తెలిపారు. జడ్చర్ల బస్టాండ్‌లో సీసీ కెమెరాల ను పరిశించడం తోపాటు హైదారాబాద్ బస్టాండ్, ఇతర ప్రదేశాల్లో నీ కెమెరాల ను పరిశీలించి నిందితులను గుర్తించడం జరిగిందన్నారు. ఉత్తర ప్రదేశ్ రాష్ట్రం బిజ్నూర్ జిల్లాకు చెందిన షారుక్, సత్తార్,దిల్ షాద్ అహ్మద్‌లుగా గుర్తించి అక్కడి అధికారులతో మాట్లాడి అరెస్టు చేసి కోర్టులో ప్రవేశ పెట్టి తీసుకురావడం జరిగిందన్నారు. నిందితుల నుంచి రూ.36 లక్షల రూపాయలకు గాను రూ.29,25,000 రూపాయలను రికవరీ చేశామని పేర్కొన్నారు. ఇంకో 75000 రూపాయలు హైదారాబాద్ లో తెలిసిన వారికి ఇచ్చినట్లు తెలిసిందని వాటిని త్వరలోనే రికవరీ చేస్తామన్నారు. నిందితుల్లో ఇద్దరనీ కస్టడీకి తీసుకున్నామని దిల్ షాద్ అహమ్మద్ అనే నిందితుడికి అనారోగ్య కారణాలవల్ల నోటీసులు ఇవ్వడం జరిగిందని తెలిపారు. ఈ ముఠా ఇదే తరహాలో గతంలోనూ చోరీలకు పాల్పడ్డారనీ వీరి పై మూడు కేసులు ఉన్నాయన్నారు. ప్రజలు సీసీ కెమెరాల పై అవగాహన పెంచుకోవాలని అన్నారు. జడ్చర్ల పట్టణంలో సీసీ కెమెరాలు తక్కువగా ఉన్నాయని ప్రజలు కమ్యూనిటీ గా ఏర్పడి సీసీ కెమెరాల ను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. కేసు ను త్వరగా ఛేదించిన పోలీసులను ఆమె అభినందించి, వారికి రివార్డులు అందజేశారు. ఈ కార్యక్రమంలో సీఐలు ఆదిరెడ్డి, నాగార్జున గౌడ్, ఎస్సైలు శివానంద్ గౌడ్, అశోక్ బాబు, కానిస్టేబుల్స్ వెంకటయ్య, బాలు పాల్గొన్నారు.

భూ అక్రమార్కులపై ..
చర్యలు తీసుకోవాలని ధర్నా



నవతెలంగాణ - గండీడ్

భూ అక్రమార్కులపై చర్య తీసుకోవాలని అంబేద్కర్ సంఘం మండల నాయకులు సోమవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ మండలంలోని వెన్నచెడ్ గ్రామానికి చెందిన చెందిన దొడ్డే చెన్నయ్య తండ్రి పేరు దోడ్డే పోషయ్య, పెద్దవార్వాల్ శివారుసర్వే నంబర్ 175 లో 3 ఎకరాల 39 గుంటల విస్తీర్ణం గల భూమిని వారికి తెలియకుండానే వారి ఆధార్ కార్డు అగ్రికల్చర్ ఆఫీసర్ దగ్గర తీసుకొని, పాస్ బుక్ ఆన్‌లైన్‌లో తీసుకుని స్లాట్ బుక్ చేసుకున్నట్లు తెలిపారు. అక్రమంగా స్థానిక తహసీల్దార్ తో చేతులు కలిపి మమ్మల్ని బెదిరించి కిడ్నాప్ చేసి రిజిస్ట్రేషన్ చేసుకునేందుకు ప్రయత్నించారని వాపోయారు. జిల్లా అధికారులు స్పందించి అక్రమార్కులపై చట్ట రీత్య చర్యలు తీసుకోవాలని జిల్లా అధికారులను వేడుకుంటున్నారు. ఈ కార్యక్రమంలో బాధితులకు అండగా ఉండి వాళ్ల సమస్య గురించి అధికారులతో మాట్లాడతామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల అంబేద్కర్ సంఘం నాయకులు హస్నా బాద్ వెంకటయ్య, బాధిత రైతు దోడ్డే చెన్నయ్య వారి కుమారులు,చెన్నయపల్లి తండా రాజు తదితరులు పాల్గొన్నారు.

యువత మత్తుకు దూరంగా ఉండాలి : సీఐ

నవతెలంగాణ - జడ్చర్ల



యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సీఐ ఆదిరెడ్డి , గోనయో ఫౌండర్ వడ్ల ప్రశాంత్ చారి అన్నారు. మంగళవారం జడ్చర్ల పట్టణంలో గోనయో ఫౌండేషన్ ఆధ్వర్యంలో యాంటి నార్కోటిక్ డ్రగ్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మత్తు పదార్థాల వల్లే జరిగే అనర్థాలు, ఎలా అరికట్టాలో, మంచి సమాజం నిర్మాణం కోసం విద్యార్థులు, యువత, ప్రతీ కుటుంబం కూడా బాధ్యతగా వ్యవహరించి మెరుగైన సమాజం కోసం, నైతిక విలువలతో కూడిన మత్తు రహిత తెలంగాణ రాష్ట్ర, భారతదేశ ఏర్పాటుకు ప్రతీ ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్ర మంలో గోనయో ఫౌండేషన్ సభ్యులు, ప్రభుత్వ బాలికల, బాలల కళశాల విద్యార్థులు, వైష్ణవి, చైతన్య, విశ్వ వికాస్ ప్రైవేట్ జూనియర్ కళాశాల విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

రైతు రుణమాఫీపై హర్షం

- యువజన కాంగ్రెస్ జిల్లా సెక్రటరీ గంగారం లక్ష్మీకాంత్ రెడ్డి



నవతెలంగాణ - మహమ్మదాబాద్

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇచ్చిన మాట మీద నిలబడి రెండో విడతలో రూ.1.5 లక్షల రైతు రుణమాఫీ చేయడం హర్షించదగ్గ విషయం అని జిల్లా యువజన కాంగ్రెస్ సెక్రెటరీ గంగారం లక్ష్మీకాంత్ రెడ్డి అన్నారు. మంగళ వారం నవతెలం గాణతో ఆయన మాట్లాడుతూ త్వరలో మిగతా రెండు లక్షల రూపాయలు రైతులకు మూడో విడతలో కాంగ్రెస్ ప్రభుత్వం రుణ మాఫీ చేస్తుందని, ఇది బీద రైతుల ప్రభుత్వమని చెప్పారు. దివంగత సీఎం రాజశేఖర్‌రెడ్డి అడుగుజాడల్లో ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి నడుస్తున్నరని, కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలతో అన్ని వర్గాల ప్రజలు సంతోషంగా ఉన్నారని అన్నారు. రాబోయే స్థానిక సంస్థ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ప్రజలు బ్రహ్మరథం పట్టడం ఖాయమని అన్నారు.

కళ్యాణలక్ష్మీ చెక్కుల పంపిణీ



జడ్చర్ల : జడ్చర్ల మండల కేంద్రంలోని తహ సీల్దార్ కార్యాలయంలో మంగళవారం తహసీల్దార్, కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న కల్యాణలక్ష్మీ చెక్కులను జడ్చర్ల శాసనసభ్యులు జనంపల్లి అనిరుధ్ రెడ్డి ఆదేశాల మేరకు.. లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేశారు.

కేతిరెడ్డిపల్లిలో ఘనంగా బోనాలు

బాలానగర్ : బాలానగర్ మండలంలోని కేతిరెడ్డిపల్లిలో మంగళవారం బొడ్రాయి పండుగ, కోట మైసమ్మ బోనాలు గ్రామ పెద్దలు, మహిళలు , బంధువులు కోట మైసమ్మబొడ్రాయి గ్రామ ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. గ్రామ పెద్దలు మాజీ సర్పంచ్ రామ్ రెడ్డి, డీలర్ చెన్నారెడ్డి, నరసింహారెడ్డి, నాగిరెడ్డి, జైపాల్‌రెడ్డి, వివిధ వర్గాల ప్రజలు బోనాల పండుగను జరుపుకున్నారు.

సీపీఐ(ఎం) పోరుబాటను జయప్రదం చేయండి

- జిల్లా కార్యదర్శి ఎండీ.జబ్బార్



నవతెలంగాణ-వనపర్తి

భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) (సీపీఎం) జిల్లా కమిటీ ఆగస్టు 1 నుంచి 10వ తేదీ వరకు చేపట్ట నున్న పోరు బాట కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పార్టీ జిల్లా కార్యదర్శి ఎండీ.జబ్బార్ మంగళవారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. పోరుబాటలో భాగంగా జిల్లాలోని 14 మండలాల్లోని ప్రతి గ్రామంలో ప్రతి కుటుంబాన్ని కలిసి ఇండ్ల స్థలాలు, రుణమాఫీ, పంటల బీమా, ఇందిరమ్మ ఇండ్ల పథకం, రేషన్ కార్డులు, ఉపాధి కూలీలకు పెండింగ్ డబ్బులు, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, అసంఘటిత రంగ కార్మికుల సమస్యలు అధ్యయనం చేయాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. గుర్తించిన సమస్యలపై స్థానిక పంచాయతీ కార్యదర్శులకు, తాహసీల్దార్లకు వినతి పత్రాలు అందజేయాలని సూచించారు. ప్రజా సమస్యలపై ఆ దశలవారీగా పోరాటాలు నిర్వహిస్తామన్నారు. కార్యకర్తలు దళాలు గా ఏర్పడి సీపీఎం పోరు బాట కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

పాన్‌గల్ ఎస్సై జిల్లా హెడ్ క్వార్టర్‌కు అటాచ్

- ఎస్పీ రావుల గిరిధర్



నవతెలంగాణ- వనపర్తి

వ్యక్తిపై దురుసుగా ప్రవర్తించారనే ఆరోపణలు ఎదుర్కొంటున్న పాన్‌గల్ ఎస్సై కళ్యాణ్ కుమార్‌ను జిల్లా హెడ్ క్వార్టర్‌కు అటాచ్ చేసినట్లు ఎస్పీ రావుల గిరిధర్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈనెల 28వ తేదీ రాత్రి నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో రంజిత్ కు మార్ మద్యం మత్తులో తన వాహనానికి తగిలాడనే నెపంతో ఎస్సై కళ్యాణ్‌కుమార్ అతనిపై చేయి చేసుకున్నాడని ప్రాథమిక విచారణలో తేలిందని, కావున సీసీఏ రూల్స్‌కు విరుద్ధంగా ప్రవర్తించినందున మల్టీజోన్ -2 ఐజి పూర్తి విచారణకు ఆదేశించారని పేర్కొన్నారు. విచారణ అనంతరం ఎస్సైపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్పీ పేర్కొన్నారు. ఏ అధికారైనా సీసీఏ రూల్స్‌కు విరుద్ధంగా ప్రవర్తిస్తే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

జీపీ కార్మికుల అరెస్టు అక్రమం

- సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఆంజనేయులు



మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా కార్యదర్శి పుట్టా ఆంజనేయులు

నవతెలంగాణ-వనపర్తి

చలో హైదరాబాద్ కార్యక్రమానికి వెళ్తున్న గ్రామ పంచాయతీ కార్మికులను అరెస్టు చేయడం అక్రమమని సీఐటీయూ జిల్లా కార్యదర్శి పుట్ట ఆంజనేయులు అన్నారు. మంగళవారం హైదరాబాద్ వెళ్తున్న కార్మికులను పోలీసులు అరెస్టు చేసి వనపర్తి రూరల్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా ఆయన కార్మికులతో కలిసి మాట్లాడారు. గ్రామ పంచాయతీ కార్మికులు తమ సమస్యల పరిష్కారం కోసం చలో హైదరాబాద్‌కు వెళ్లేందుకు సిద్ధంకాగా పోలీసులు గ్రామాలకు వెళ్లి ఇండ్లల్లో ఉన్న వారిని అరెస్టు చేయడం అక్రమమన్నారు. దీనిని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం గ్రామ పంచాయతీ కార్మికులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని, 51 జీ ఓ రద్దు చేయాలని, కారోబార్, బిల్ కలెక్టర్‌లకు స్పెషల్ స్టేటస్ ఇచ్చి ఆదుకోవాలని సిబ్బంది రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి విన్నవించడంతో పాటు, వేతనాలు పెంచాలని పంచాయతీరాజ్ శాఖ మంత్రిని కూడా కలిసి విన్నవించినా ఎలాంటి ఫలితం లేదన్నారు. ప్రభుత్వం స్పందించక పోవడం వల్లే జీపీ కార్మికులు చలో హైదరాబాద్ కార్యక్రమం చేపట్టారన్నారు. జీపీ కార్మికులకు కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని, వారిని పర్మినెంట్ చేయాలని, మల్టీపర్పస్ వర్కర్ పద్ధతి రద్దు చేయాలని, బకాయి పడ్డ ఏడు నెలల వేతనాలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. పోలీసులు అరెస్టు చేసిన జీపీ కార్మికులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. పోలీసులు అరెస్టు చేసిన వారిలో రాజపేట కారోబార్ రాములు, గ్రామ పంచాయతీ కార్మికులు దేవన్న, బాలయ్య, కొండన్న, సవారయ్య తదితరులు ఉన్నారు.

జీపీ కార్మికుల అరెస్ట్ తగదు



పోలీసులు అరెస్టు చేసిన జీపీ కార్మికులు

వీపనగండ్ల: హైదరాబాదులో నిర్వహించే ధర్నాకు బయలు దేరుతున్న గ్రామ పంచాయతీ కార్మికులను పోలీసులు ముందస్తు అరెస్టు చేయడం తగదని మండల గ్రామ పంచాయతీ కార్మికుల సంఘం నాయకుడు వీర బాబు మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. పోలీసులు అరెస్టు చేసిన వారిలో గ్రామపంచాయతీ కార్మికులు శివాజీ రాముడు, గంగమ్మ, మంగమ్మ, తదితరులు ఉన్నారు.

ఆశా కార్యకర్తలను అరెస్టు చేయడం తగదు

నవతెలంగాణ-వీపనగండ్ల

ఆశా కార్యకర్తలు సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ హైదరాబాదులో మెడికల్ కార్యాలయం ముందు నిర్వహించే ధర్నాకు బయలుదేరుతున్న వారిని పోలీసులు ముందస్తుగా పోలీసులు అరెస్టు చేసి పోలీస్ స్టేషన్ కి తరలించడం తగదు అని చిన్నంబావి మండల మాజీ ఎంపీపీ సోమేశ్వరమ్మ, మాజీ జెడ్పిటిసి కే సి రెడ్డి వెంకటరమణమ్మ చిన్నారెడ్డి ఒక ప్రకటనలో ఖండించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ఆశా కార్యకర్తల సమస్యల పరిష్కరిస్తామని హామీ ఇచ్చి అమలు చేయకపోవడంతో శాంతియుతంగా నిరసన కార్యక్రమం చేయడానికి వెళుతున్న వారిని అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్ ముందు నిలబెట్టడం ఏంటని మహిళలకు కించపరిచే విధంగా ప్రభుత్వం చేస్తుందని మం డి పడ్డారు. ఆశా కార్యకర్తల సమస్యలు పరిష్కరించకపోతే వారికి పక్షాన నిలబడి ఆందోళన పోరాటాలు ఉధృతం చేస్తామని వారు హెచ్చరించారు.

సెల్ ఫోన్ రికవరీ - బాధితుడికి అందజేత

నవతెలంగాణ- ఆత్మకూర్

ఆత్మకూరు మండలం ములమల్ల గ్రామానికి చెందిన గిరిధర్ చారి గత నెల 21న ఆత్మకూరుకు మోటార్ సైకిల్‌పై వస్తుండగా సెల్ ఫోన్ పోయింది. వెంటనే ఆత్మకూరు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు సీఈఐఆర్ అప్లికేషన్ ద్వారా బాధితుడ ఫోన్ సింగంపేట గ్రామంలో ఉన్నట్లు గుర్తించి రికవరీ చేసి మంగళవారం ఎస్సై నరేందర్ బాధితుడికి అందజేశారు.

రైతులకు ఇబ్బంది కలిగించొద్దు


- కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు నాగరాజుగౌడ్



నవతెలంగాణ- ఆత్మకూరు

రుణమాఫీ అయిన రైతులకు ఇబ్బంది కల్గించకుండా మాఫీ డబ్బులను వారి ఖాతాలో జమ చేయాలని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి కేసం నాగరాజుగౌడ్ బ్యాంకు అధికారులను కోరారు. ప్రభుత్వం ఇదివరకు మంజూరు చేసిన రుణమాఫీపై రైతులు పడుతున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని మంగళవారం ఆయన కాంగ్రెస్ నాయకులతో కలసి పట్టణంలోనే వివిధ బ్యాంక్ మేనేజర్లను, ఫీల్డ్ ఆఫీసర్లను కలిసి రైతులకు ఇబ్బందులు పడకుండా సకాలంలో మాఫీ చేసి, కొత్త రుణాలు ఇవ్వాలని సూచించారు. ఆనంతరం వారు ప్రభుత్వ ఆసుపత్రిని సందర్శించి సూపరింటెండెంట్ హరి నారాయణతో ఆసుపత్రి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం డిసిసిబి బ్యాంక్‌ను సందర్శించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఉద్యోగ విరమణ సన్మాన కార్యక్రమం



నవతెలంగాణ- ఆత్మకూరు

ఆత్మకూరు పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మంగళవారం ప్రిన్సిపాల్ రాజేశ్వరరావు పదవీ విరమణ సన్మాన కార్యక్రమం నిర్వహిం చారు. ఈ సందర్భంగా అధ్యాపకులు, విద్యార్థులు ప్రిన్సిపాల్ రాజేశ్వర్ రావును ఘనంగా సన్మానించారు.

వైద్యుల నిర్లక్ష్యం.. పసికందు మృతి

- ప్రభుత్వాస్పత్రి ఎదుట బాధిత కుటుంబ సభ్యుల ఆందోళన
- వైద్యురాలు, స్టాఫ్‌నర్స్ సస్పెండ్



పసికందు మృత దేహంతో ధర్నా చేస్తున్న బాధిత కుటుంబ సభ్యులు

నవతెలంగాణ-పెబ్బేరు

వైద్యుల నిర్లక్ష్యంతో పసికందు మృతి చెందిన ఘటన పెబ్బేరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం చోటుచేసుకున్నది. బాధిత కుటుంబ సభ్యుల వివరాల ప్రకారం పెబ్బేరు పురపాలక పరిధి లోని చెలిమిల్లకు చెందిన రాజేశ్వరి పురిటి నొప్పులతో సోమవారం రాత్రి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి రాగా వైద్య సిబ్బంది పరీక్షించి ప్రస్తుతం నొప్పులు నార్మల్ గానే ఉన్నాయని నొప్పులు అధికమైనప్పుడు తీసుకురండి అని చెప్పడంతో రాత్రి ఇంటికి వెళ్లారు. నొప్పులు అధికం కావడంతో మంగళవారం ఉదయం ఆస్పత్రికి రాగా వైద్యులు లేకుండానే స్టాఫ్ నర్స్, స్వీపర్ నార్మల్ డెలివరీ చేసేందుకు ప్రయత్నించారు. ఆసమయంలో అధిక రక్తస్రావమై పరిస్థితి విషమించడంతో వనపర్తి ఏరియా హాస్పిటల్ తరలించారు. అక్కడ వైద్యులు ఆపరేషన్ చేయగా అప్పటికే శిశువు మృతి చెందినట్లు తెలిపారు. పెబ్బేరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది నిర్లక్ష్యం వల్లే పసికందు మృతి చెందిందని ఆస్పత్రి ఎదుట ఆందోళనకు దిగారు. ప్రసవం కోసం ఉదయం 8 గంటలకు తీసుకొస్తే అక్కడి సిబ్బంది 11 గంటల వరకు సమయం వృధా చేయడంవల్లే పసికందు చనిపోయాడని అందుకు బాధ్యులను సస్పెన్షన్ చేయాలని బాధిత కుటుంబ సభ్యులు ఆస్పత్రి ఎదుట బైఠాయించారు. సాయంత్రమైనా అధికారులెవరూ పట్టించుకోకపోవడంతో వారు పసికందు మృతదేహంతో ప్రధాన రహదారిపై ఆందోళన చేపట్టారు. ఎస్సై హరిప్రసాద్‌రెడ్డి అక్కడికి చేరుకొని జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో జిల్లా ప్రోగ్రాం అధికారి రామచంద్రారావు ఘటన స్థలానికి చేరుకొని బాధిత కుటుంబ సభ్యులతో వివరాలు అడిగి తెలుసు కొని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో పసికందు మృతికి కారణమైన స్టాఫ్ నర్స్ బాలమని, వైద్యురాలు ఎంఎల్ హెచ్పి సుధారాణిని సస్పెండ్ చేయడంతో పాటు స్వీపర్ గౌరీని విధుల నుంచి తొలగిస్తున్నట్లు ప్రోగ్రాం అధికారి ప్రకటించారు. దీంతో బాధిత కుటుంబ సభ్యులు ఆందోళన విరమించారు.



ఆందోళన చేస్తున్న వారితో మాట్లాడుతున్న జిల్లా ప్రోగ్రాం అధికారి

రెండో విడత 16 వేల మంది రైతులకు రుణమాఫీ

- జిల్లాకు రూ.154 కోట్లు విడుదల
- కలెక్టర్ ఆదర్శ్ సురభి



కార్యక్రమంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఆదర్శ్ సురభి

నవతెలంగాణ- వనపర్తి

రెండో విడత రైతు రుణ మాఫీ సందర్భంగా వనపర్తి జిల్లాలో 16,527 రైతు కుటుంబాలుకు ప్రభుత్వం రూ.154.58 కోట్ల నిధులు విడుదల చేసినట్లు కలెక్టర్ ఆదర్శ్ సురభి తెలిపారు. మంగళవారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హైదారాబాద్ లో రెండో విడతగా 6.30 లక్షల రైతు కుటుంబాలకు రూ. 6,198 కోట్లు రుణమాఫీ ప్రకటించగా ఐడి ఒసి సమావేశ మందిరంలో జిల్లా వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో కలెక్టర్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన కార్యక్రమానికి వ్యవసాయ శాఖ అధికారులు, రైతు సం ఘాల నాయకులు, రైతులు, బ్యాంకర్లు హాజరయ్యా రు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా లోని 16,527 మంది రైతు కుటుంబాలకు రూ. 154.58 కోట్లు విడుదలచేసినట్లు తెలిపారు. మొదటి విడత రుణమాఫీలో లక్ష రూపాయల వరకు జరిగిన రుణమాఫీ జిల్లాలోని 27,066 మంది రైతు కుటుంబాలకు రూ. 145.55 కోట్లు రైతుల ఖాతాల్లో జమ చేయడం జరిగిందన్నారు. మొదటివిడతలో వివిధ కారణాల వల్ల 1,140 మంది రైతులకు రుణ మాఫీ జరగలేదన్నారు. త్వరలోనే సమస్యను పరిష్కరించి వారి ఖాతాల్లో రుణమాఫీ జమ చేయడం జరుగుతుందన్నారు. ప్రస్తుతం విడుదలైన నిధులను త్వరగా రైతుల ఖాతాల్లో జమ చేసేందుకు చర్యలు తీసుకోవాలని బ్యాంకర్లను సూచించారు.

కంట్రోల్ రూం ఏర్పాటు

రెండో విడతలో సైతం ఆధార్ కార్డులో పేరుకు బ్యాంకులో ఉన్న పేరుకు తేడా ఉండటం లేదా అకౌ ట్ నెంబర్ సరిగ్గా రాయకపోవడం వంటి చిన్న చిన్న సమస్యల వల్ల ఎవరికైనా రుణమాఫీ రాని పక్షంలో కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూం నెంబర్ 08545-220351 లేదా 08545-233525 కు ఫోన్ చేయాలని సూచించారు.

కలెక్టర్ ఉదయం పెద్దమందడి మండలంలోని మణిగిల్ల గ్రామ శివారులో జరుగుచున్న క్రాప్ బుకింగ్ ప్రక్రియను పరిశీలించారు. అనంతరం పెద్ద మందడి, నాగవరం రైతువేదికల్లో రుణమాఫీ కార్యక్రమాన్ని రైతులు వీక్షించేందుకు ఏర్పాటు చేసిన టీవీ తెరల ఏర్పాట్లు పరిశీలించారు. రైతులతో ముచ్చటించి వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు.

ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ మెంచు నగేష్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి సుధాకర్ రెడ్డి, లీడ్ బ్యాంక్ మేనేజర్ కౌశల్ కిషోర్, ప్యాక్స్ చైర్మన్లు, బ్యాంకర్లు, మండల వ్యవసాయ అధికారులు, రైతు సంఘాల నాయకులు, రైతులు పాల్గొన్నారు.

భూసేకరణ వేగవంతం చేయాలి

నవతెలంగాణ వనపర్తి : జిల్లాలో వివిధ ప్రాజెక్టులకు సంబంధించిన భూసేకరణ ప్రక్రియను వేగవంతం చేయాలని కలెక్టర్ ఆదర్శ్ సురభి అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టర్ తన ఛాంబర్ లో రెవెన్యూ, ఇరిగేషన్, పంచాయతీరాజ్, మిషన్ భగీరథ ఇంజనీరింగ్ అధికారులతో భూసేకరణపై సమీక్ష నిర్వహించారు. పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టుకు సంబంధించి అప్పాయపల్లి, గోపాల్ పేట మండలం మన్ననూరు, సల్కలాపూర్‌కు సంబంధించిన వాటికి వారం రోజుల్లో పీడీ అవార్డు జారీ చేయాలని భూసేకర ణ ప్రత్యేక ఉప కలెక్టర్‌ను ఆదేశించారు. గణప సముద్రం, మాధవరావు పల్లి, మామిడిమాడ ప్రాం తంలోని భూసేకరణ వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఇరిగేషన్ శాఖకు సంబంధించిన ఇతర సమస్యలు, పునరావాస కేంద్రాలపై త్వరలో ప్రత్యేక సమీక్ష నిర్వహించనున్నట్లు కలెక్టర్ తెలిపారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ నగేష్, భూసేకరణ ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్ సి.హెచ్ వెంకటేశ్వర్లు, ఇరిగేషన్ ఎస్. ఈ సత్యశీలా రెడ్డి, ఇరిగేషన్ ఈఈలు మధుసూదన్ రావు, కేశవరావు, తదితరులు పాల్గొన్నారు.

హాస్టల్ విద్యార్థుల మెస్ చార్జీలు పెంచాలి: కేవీపీఎస్



నవతెలంగాణ-వనపర్తి

పెరుగుతున్న ధరలకు అనుగుణంగా సంక్షేమ హాస్టల్ దవిద్యార్థులకు మెస్ చార్జీలు పెంచాలని కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు గంధం భగత్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా మంగళవారం కేవీపీఎస్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జిల్లాలో సాంఘిక సంక్షేమ, కస్తూర్బా, ఎస్ఎంహెచ్ గురుకులాలను సందర్శించి విద్యార్థుల సమస్యలను తెలుకున్నారు. గోపాల్‌పేట్ మండల కేంద్రంలోని సంక్షేమ హాస్టల్, కస్తూర్బా పాఠశాలను భగత్ సందర్శించి సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యా సంవత్సరం ప్రారంభమై నెల 15 రోజులు అవుతున్న హాస్టల్ విద్యార్థులకు పెట్టెలు, గ్లాసులు, ప్లేట్లు, దుప్పట్లు, బెడ్లు ఇవ్వలేదన్నారు. విద్యార్థుల సంఖ్య కనుగుణంగా మరుగుదొడ్లు బాత్రూములు లేవన్నారు కస్తూర్బా పాఠశాలలో మౌలిక వసతులు సరిగా లేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా మెస్ చార్జీలు పెంచాలని, పెండింగ్ లో ఉన్న ప్యాకెట్ మనీ డబ్బులు వెంటనే ఇవ్వాలని మెనూ సక్రమంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కేవీపీఎస్ మండల కార్య దర్శి సుధాకర్, హాస్టల్ విద్యార్థులు పాల్గొన్నారు.

మదనాపురంలో..

మదనాపురం: కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు వెంకట్ రాములు ఆధ్వర్యంలో కొత్తకోట మండల కేంద్రంలోని హాస్టళ్లను సందర్శించి సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం తాహశీల్దార్ కార్యాలయంలో డీటి శివ కుమార్‌కు వినతి పత్రం అందజేశారు. ప్రస్తుత సీజన్లో దోమల నివారణకు చర్యలు తీసుకోవాలన్నారు. ఆట వస్తువులు, క్రీడా మైదానాన్ని ఏర్పాటు చేయాలని సూచించారు. సమస్యలు తక్షణమే పరిష్కరించి రాష్ట్రప్రభుత్వం మెస్ చార్జీల పెంపునకు బడ్జెట్ పెంచడంతో పాటు విద్యార్థులకు వైద్య పరీక్షల కోసం వైద్యులను నియమించాలని డిమాండ్ చేశారు. సమస్యలను పరిష్కరించకుంటే దశల వారిగా ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయ కులు గుండె నారాయణ, మనివర్ధన్, భీమయ్య, తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలు, నూతన చట్టాలపై అవగాహన



నవతెలంగాణ-పెబ్బేరు

బాల్యవివాహాలను అరికట్టడంతో పాటు, పోలీసు చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కల్గిఉండాలని ఎస్సై హరిప్రసాద్ రెడ్డి అన్నారు. మంగళవారం పెబ్బేరు మండలం గుమ్మడం గ్రామంలో నూతన చట్టాలపై అవగాహన కార్యక్రం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ కొత్త చట్టాల శిక్ష కఠినంగా ఉన్నాయని గొడవలకు పాల్పడకుండా ప్రజలు సామరస్యంగా కలిసి ఉండాలని అనవసరమైన విషయాలపై జోక్యం చేసుకోకుండా నేరాలను అరికట్టాలని అన్నారు. పిల్లలను బాగా చదివించాలని, చదు వు వల్ల కలిగే ప్రయోజనాలను తమ తమ ఇండ్లలో వారి తల్లిదండ్రులు పిల్లలకు వివరించాలన్నారు. తల్లిదండ్రులు బాల్య వివాహాల వైపు మొగ్గుచూపితే బాల్య వివాహాలవల్ల కలిగే దుష్ప రిణామాల గురించి వివరిస్తూ సం బంధించిన బాల్య వివాహాల చట్టాల గురించి అవ గా హన కల్పించారు. అదేవిధంగా వాహనదారులు తప్ప నిసరిగా డ్రైవింగ్ లైసెన్సు, ఇన్సూరెన్స్ సం బం ధిత డాక్యుమెంట్స్ కలిగి ఉండాలని సూ చించారు. ప్రస్తుతం సైబర్ నేరగాల మోసాలు పెరిగిపోతున్నాయన్నారు. వాట్సాప్ గ్రూ ప్ లో గానీ, యూట్యూబ్, ఇన్‌స్టాగ్రామ్‌లో ఉన్న ఫేక్ లింకులను క్లిక్ చేస్తే మన సమాచారమంతా నేగాళ్లకు చేరి మన అకౌంట్లలోని డబ్బు దోచేస్తారన్నారు. ఖరీఫ్ సీజన్‌లో ప్రభుత్వంచే గుర్తింపు పొంది అనుమతించబడిన షాపులలో మాత్రమే రైతులు విత్తనాలు కొనుగోలు చేయాలని సూచించారు. గ్రామంలో సీసీ కెమెరాలు అమర్చు కుంటే దొంగతనాలు నివారించవచ్చన్నారు. యువత చెడుదారిన వెళ్లకుండా ఉన్నత లక్ష్యంతో చదువుకోవాలని సూచించారు. తమ పిల్లలు చెడు దారి పడితే తల్లిదండ్రులు పోలీసుల దృష్టికి తేవాలని సూచించారు. అనంతరం గ్రామ స్తులు ఎస్సైని సన్మానించారు. కార్యక్రమంలో గ్రామ నాయకులు, యువకులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

గర్భిణి మృతిపై అధికారుల విచారణ

నవతెలంగాణ- పెబ్బేరు

పెబ్బేరు మండల కేంద్రంలోని ప్రజా వైద్యశాల ప్రైవేట్ ఆస్పత్రి వైద్యుల నిర్లక్ష్యంతో శ్రీరంగాపురం మండలం నాగసానిపల్లె గ్రామానికి చెందిన గర్భిణి మృతి చెందిన ఘటనపై మంగళవారం అడిషనల్ కలెక్టర్ సంచిత్ గాంగ్వార్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధికారి జయచంద్ర మోహన్ విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా ఆస్పత్రిలోని రికార్డులను తనిఖీ చేశారు. వారి వెంట జిల్లా ఉప వైద్య ఆరోగ్యశాఖ ఆధికారి శ్రీనివాసులు, మాస్ మీడియా అధికారి చంద్రయ్య, హెల్త్ ఎడ్యుకేటర్ రవి, హెల్త్ సూపర్వైజర్ మహేశ్వరాచారి ఉన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

- జిల్లా ప్రోగ్రాం అధికారి వంశీకృష్ణ



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ వంశీకృష్ణ

నవతెలంగాణ- వీపనగండ్ల

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ వంశీకృష్ణ అన్నారు. మండల కేంద్రంలోని సామాజిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం వైద్య సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటి పరిసరాల్లో నీరు నిలవకుండా పరిశుభ్రంగా ఉంచుకునేలా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. దోమలు ఈగలు వల్ల డెంగ్యూ, మలేరియా వంటి విష జ్వరాలు ప్రబలే అవకాశం ఉందని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. గ్రామాల్లో వైద్య సిబ్బంది నిరంతరం పర్యవేక్షణ చేస్తూ రోగులకు పరీక్షల నిర్వహిస్తూ మందులు పంపిణీ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ రాజశేఖర్, డాక్టర్ ప్రియాంక, ఆయుష్ డాక్టర్స్, సూపర్‌వైజర్స్, డీఈవో రాజశేఖర్, ఏఎన్ఎంలు తదితరులు పాల్గొన్నారు.

ఎస్సైని కలిసిన ఎన్‌పీఆర్‌డీ నాయకులు

నవతెలంగాణ-వీపనగండ్ల

ఫ్రెండ్‌షిప్ డే సందర్భంగా వికలాంగుల హక్కుల జాతీయ వేదిక జిల్లా కమిటీ అధ్యక్షుడు ప్రభుస్వామి ఆధ్వర్యంలో ఎన్‌పీఆర్‌డీ నాయకులు మంగళవారం వనపర్తి పట్టణ టౌన్ ఎసైని మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వికలాంగుల హక్కుల జాతీయ వేదిక జిల్లా నాయకులు రవి, బాలరాజు, కృష్ణ సాగర్, ఠాగూర్, ఎస్సీ, ఎస్టీ అఖిల పోరాట సమితి అధ్యక్షుడు నాగరాజు, నాగేష్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే కాంగ్రెస్ పార్టీ ధ్యేయం



నవతెలంగాణ- వీపనగండ్ల

ప్రజా సంక్షేమమే కాంగ్రెస్ పార్టీ ధ్యేయమని ఆపార్టీ మండల నాయ కుడు గోపాల్ నాయక్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ బడుగు బలహీన వర్గాల అభివృద్ధి కోసం కృషి చేస్తుందన్నారు. రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ ఆగస్టు 15 లోగా పూర్తి చేస్తామన్న సీఎం రేవంత్ రెడ్డి రెండో విడత రుణమాఫీ డబ్బులు ఖాతాల్లో జమ చేశారన్నారు. ఎన్నికల ముం దు ఇచ్చిన హామీలు ఆరు గ్యారెంటీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తు న్నారన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం రైతులకు రుణమాఫీ చేయకుండా నిర్లక్ష్యం చేసిందన్నారు. కొల్లాపూర్ నియోజక వర్గం అభివృద్ధి కి రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు కృషి చేస్తున్నారన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి అండగా నిలవాలని మండల ప్రజలను కోరారు.

రైతు బాంధవుడు సీఎం రేవంత్ రెడ్డి



నవతెలంగాణ -వనపర్తి

రెండో విడత రైతు రుణమాఫీ నిధులను విడుదల చేసి ముఖ్యమంత్రి సీఎం రేవంత్ రెడ్డి రైతు బాంధవుడు అయ్యారని కాంగ్రెస్ పార్టీ నాయకులు మండ్ల దేవన్న నాయుడు మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. లక్షన్నర లోపు రుణాలను లబ్దిదారుల ఖాతాలకు జమ చేశారన్నారు. వ్యవసాయం దండగ కాదు పండగ అని నిరూపిస్తూ లక్షలాది మంది రైతుల ఇళ్లల్లో సంతోషాన్ని నింపారన్నారు. ఇప్పటికే లక్ష లోపు రుణాలను మాఫీ చేశారని, రైతుల ఖాతాలకు రూ.6098 కోట్లు విడుదల చేశారన్నారు. రైతు రుణమాఫీకి కాం గ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. రైతు రుణాలను మాఫీ చేసిన ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డికి, ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డికి, రాష్ట్ర, జిల్లా రైతుల పక్షాన ధన్యవాదాలు తెలిపారు.

ఘనంగా బోనాల వేడుకలు

నవతెలంగాణ-మదనాపురం

మదనాపురం మండలంలోని అజ్జకోలు గ్రామంలో మంగళవారం బోనాల ఉత్సవాలను గ్రామస్తులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పడుచులు బోనాలతో ఊరేగింపుగా అమ్మవారి ఆలయానికి వెళ్లి నైవేద్యం సమర్పించి మొక్కలు చెల్లించుకున్నారు. మాజీ జెడ్పీటిసిలు కృష్ణయ్య యాదవ్, వంగూరు బాలమనెమ్మ, మాజీ సర్పంచులు వంగూరు విజయేందర్ రెడ్డి, వాకిట సత్యం తదితరులు గ్రామస్తులకు పండుగ శుభాకాంక్షలు తెలిపారు.



నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
3
నాగర్‌కర్నూల్
బుధవారం | జూలై 31, 2024 | www.navatelangana.com

డ్రైవర్లు ప్రశాంతంగా విధులు నిర్వహించాలి

- డిపో మేనేజర్ యాదయ్య



నవ తెలంగాణ-కందనూలు

డ్రైవర్లు ప్రశాంతంగా విధులు నిర్వహించాలని డిపో మేనేజర్ యాదయ్య అన్నారు. మంగళవారం ప్రమాద రహిత వారోత్సవాలు నాగర్ కర్నూల్ డిపోలో డ్రైవర్ కుటుంబ సభ్యులతో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్రైవర్ ప్రశాంతంగా విధులు నిర్వహించడానికి డ్యూటీకి బయలుదేరే ముందు వారి కుటుంబ సభ్యులు వారికి చిరునవ్వుతో డ్యూటీ ముగించుకొని రావాలని చెప్పాలని, తగు విశ్రాంతిని ఇవ్వాలన్నారు. రెగ్యులర్‌గా వాడే మందులు తప్పనిసరిగా వాడేలా చూడాలని ఎలాంటి వత్తిడి గురికాకుండా చూడాలని తెలిపారు. అనంతరం డిపోలోని ఉద్యోగులచే, హాజరైన డ్రైవర్ కుటుంబ సభ్యులచే డిపో ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో గ్యారేజ్ ఇంచార్జ్ బి.భాస్కర్, ట్రాఫిక్ ఇంచార్జ్ వి.సి.ఎస్.రెడ్డి, ఏడీసీలు పరశురాం, జె.శ్రీనివాసులు, ఏ.జే.ప్రకాష్, డిపో ఉద్యోగులు గ్యారేజ్ సిబ్బంది పాల్గొన్నారు.

సీఎం చిత్రపటానికి పాలాభిషేకం



నవ తెలంగాణ -కల్వకుర్తి

మండల పరిధిలోని తాండ్ర జిల్లా పరిషత్ పాఠశాల అభివృద్ధికి సీఎం రేవంత్ రెడ్డి రూ.5కోట్లు మంజూరు చేయడం పట్ల గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా గ్రామంలోని ప్రభుత్వ పాఠశాల ఆవరణలో మంగళవారం సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి గ్రామస్తులు పాలాభిషేకం చేశారు. రేవంత్ రెడ్డి చదువుకున్న పాఠశాలకు సీఎంగా వచ్చి నిధులు మంజూరు చేయడం పట్ల గ్రామస్తులు ఎంతగానో సంతోషిస్తున్నారు. బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు విజయ కుమార్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ యువజన విభాగం జిల్లా నాయకులు ఆశాదీప్ రెడ్డి, సాయి రెడ్డి, విజయసింహారెడ్డి ఆధ్వర్యంలో సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ మన గ్రామంలో చదువుకున్న వ్యక్తి ముఖ్యమంత్రిగా రావడం ఎంతో సంతోషించదగ్గ విషయమన్నారు. చదువుకున్న పాఠశాలను మరవకుండా అడగకముందే నిధులు మంజూరు చేసిన సీఎంకు వారు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

బ్లీచింగ్ పౌడర్ జాడనే లేదు



నవతెలంగాణ-వంగూరు

మండల కేంద్రంతో పాటు ఏ గ్రామ పంచాయతీలో కూడా బ్లీచింగ్ పౌడర్ చల్లిన దాఖలాలు లేవని ఆయా గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత వారం రోజుల కిందట కురిసిన వర్షాలకు చిత్తడి చిత్తడి కావడం పరిశుభ్రత లేకుండా గ్రామాలు మారడం వలన దోమలు ఎక్కువ కావడం జరిగిందని గ్రామ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆగస్టులో బోనాల పండుగకు బ్లీచింగ్ పౌడర్ చల్లితే మళ్లీ బోనాలకు ఒక సంవత్సరం తర్వాత బ్లీచింగ్ పౌడర్ చల్లడం జరుగుతుందని తెలిపారు. గ్రామ పంచాయితీకి మరియు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వారికి మెయింటెనెన్స్ ఖర్చుల కిందట వచ్చిన నిధులు ఎక్కడ పోతున్నాయని గ్రామస్తులు ప్రశ్నిస్తున్నారు. సర్పంచులు దిగిపోవడం స్పెషలాఫీసర్లు వచ్చి గ్రామాలను పట్టించుకోకపోవడం వలన పారిశుద్ధ్యం పడకేసిందని తెలిపారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు అధికారులు చొరవ తీసుకొని మరమ్మతులు చేయాలని కోరారు.

మహిళా రైతుకు రుణమాఫీ చెక్కు



నవతెలంగాణ-బిజినేపల్లి

మండలంలోని రెండో విడత రుణమాఫీ సందర్భంగా శాయిన్‌పల్లి గ్రామా నికి చెందిన. చెవిటి అలివేల భర్త పెంటయ్య అనే మహిళ రైతుకు మన జిల్లా కలెక్టర్ రూ.లక్ష 50వేలు రుణమాఫీ చెక్కును అందజేశారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మ చేపట్టిన రుణమాఫీని రెండో విడతలో రుణమాఫీ అందరి రైతులకు వారి వారి అకౌంట్‌లో మంగళవారం నుంచి మాఫీ చేయడం జరుగుతుందని కలెక్టర్ వివరించారు. రుణమాఫీ చేసినందుకు సీఎం రేవంత్ రెడ్డి మనస్ఫూర్తి గా మహిళా రైతు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో గ్రామ మాజీ సర్పంచి అవంతి శంకర్, అల్లిపూర్ వెంకటస్వామి, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

రెండో విడత రుణమాఫీపై హర్షం



నవతెలంగాణ-తాడూర్

తాడూరు మండల రుణమాఫీ రెండో విడత రైతుల జాబితా తెలిపిన రైతులకు రెండో విడుత రుణమాఫీ నిధులు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా రూ.లక్ష నుంచి లక్షా 50వేల వరకు నిధులు విడుదల చేశారు. ఈ సందర్భంగా మండల పరిధిలోని ఇంద్రకల్ వీడియో కాన్ఫరెన్స్ కార్యక్రమాని నిర్వహించారు. ఇంకా రైతులకు ఎలాంటి సమస్యలు, సందేశా లున్న మండల వ్యవసాయ అధికారిని సంప్రదించాలని వ్యవసాయ అధికారి సాయి రమేష్ రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో అధికారులు, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

14వ వార్డులో పాము హల్చల్



కందనూలు : జిల్లా కేంద్రంలోని 14వ వార్డులో సంత బజార్‌లో మంగళవారం పాము హల్చల్ చేసింది. భయంతో కాలనీవాసులు పరుగులు తీశారు. విషయం తెలుసుకున్న కౌన్సిలర్ ఖాజా ఖాన్ పాములు పట్టే వాళ్ళని పిలిచి, గంటకు పైగా శ్రమించి ఎలాంటి ప్రమాదాలు జరగకుండా పట్టుకోవడంతో కాలనీ వాసులు ఊపిరి పీల్చుకున్నారు. మున్సిపాలిటీ అధికారులు కాలనీలో విచ్చలవిడిగా తిరుగుతున్న కుక్కలు, పాముల గురించి ప్రత్యేక దృష్టి సారించి ప్రజల ప్రాణాలను కాపాడాలని కాలనీవాసులు కోరారు.

లయన్స్ క్లబ్ అధ్యక్షునిగా పసుల లక్ష్మారెడ్డి

నవతెలంగాణ-వెల్దండ

2024-25 సంవత్సరానికి గాను లయన్స్ క్లబ్ 39వ అధ్యక్షుని గా పసుల లక్ష్మారెడ్డి బుధవారం ప్రమాణ స్వీకారం చేస్తున్నట్లు లయన్స్ క్లబ్ పిఆర్‌ఓ పాషా మంగళవారం తెలిపారు. నూతన లయన్స్ క్లబ్ కమిటీ అధ్యక్షుని గా పసుల లక్ష్మారెడ్డి, కార్యదర్శిగా దోనాదుల మహేష్, కోశాధికారిగా గుజ్జరి నరసింహ, వైస్ ప్రెసిడెంట్‌గా కే.గోవర్ధన్ రెడ్డి, వైస్ ప్రెసిడెంట్‌గా ఏం.రాంరెడ్డి, వైస్ ప్రెసిడెంట్‌గా పి.వెంకట్ రెడ్డి, జాయింట్ సెక్రెటరీగా ఎంగలి బాలకృష్ణ, పిఆర్‌ఓగా ఎంఏ.పాషా, టేమర్‌గా బండేల రామచంద్రారెడ్డి, టైల్ ట్విస్టర్‌గా డి.మోహన్ రెడ్డి, లయన్స్ క్లబ్ ముఖ్య సలహాదారులుగా యాచారం, వెంకటేశ్వర్లు గౌడ్, సంపత్ కుమార్, ఎం.చంద్రశేఖర్, కరుణాకర్ రెడ్డి, ఎం.అంజయ్య, సునంద, బిక్షపతి, కే.సత్యం, కే.చంద్రకాంత్ రెడ్డి, జి.రవికుమార్, సురేందర్ రెడ్డిలు ప్రమాణ స్వీకారం చేస్తున్నట్లు పిఆర్వో పాషా తెలిపారు.

పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ పాటుపడాలి : కలెక్టర్



నవతెలంగాణ-అచ్చంపేట

వనమహోత్సవం ద్వారా విరివిగా మొక్కలు నాటి ప్రతి ఒక్కరూ పర్యావరణాన్ని కాపాడాలని కలెక్టర్ బాదావత్ సంతోష్ అన్నారు. మంగళవారం అచ్చంపేట పట్టణ శివారులోని హైదరాబాద్, రంగాపూర్ కూడలిలో నాగర్‌కర్నూల్ అటవీశాఖ ఆధ్వర్యంలో వనమహోత్సవంలో జిల్లా అటవీ శాఖ అధికారి, రెవిన్యూ అధికారులు, ప్రజలతో కలిసి రోడ్లకు ఇరువైపులా కలెక్టర్ మొక్కలు నాటారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన వనమహోత్సవంలో భాగంగా ప్రతి ఒక్కరు మొక్కలు నాటి 100శాతం లక్ష్యాలను సాధించాలన్నారు. నాటిన ప్రతి మొక్కను సంరక్షించాలని అధికారులకు సూచించారు. నాగర్‌కర్నూల్ జిల్లాలో వనమహోత్సవం సందర్భంగా నాటాల్సిన మొక్కల లక్ష్యాలను సాధించేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అటవీ శాఖ అధికారి రోహిత్ గోపిడి, అచ్చంపేట ఆర్డీఓ మాధవి, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

గుంతల మయంగా రోడ్లు



- చినుకు పడితే చిత్తడే గమ్యానికి చేరుకునేదెలా..?
- పట్టించుకోని పాలకులు అధికారులు

నవతెలంగాణ- వంగూరు

వంగూరు మండల కేంద్రంతో పాటు పలు గ్రామాలలో గుంతల మయంగా మారిన రోడ్ల పరిస్థితి అధ్వానంగా మారిందని గ్రామస్తులు తెలియజేస్తున్నారు. చినుకు పడితే చిత్తడే చిత్తడి, గమ్యానికి చేరుకునేదెట్లా అని పలు గ్రామాల ప్రజలు ప్రశ్నిస్తున్నారు. అధికారులు కానీ ప్రజా ప్రతినిధులు కానీ పట్టించుకోకపోవడం నిర్లక్ష్యమే కారణమని తెలుస్తోంది. మండలంలోని ఉల్లంపల్లి గ్రామానికి వెళ్లే దారి గుంతల మయంగా మారడంతో వాహన దారులు వెళ్లడానికి ఇబ్బందులు ఎదుర్కోక తప్పడం లేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉల్లంపల్లిలో మొత్తం బోయలు ఉండడంతోనే మమ్ములను పట్టించుకునే నాధుడు లేడని వారి బాధను వెళ్లబుచ్చారు. గత ప్రభుత్వంలో ఉన్న ఎమ్మెల్యే తప్పకుండా బీటీ రోడ్డు వేయిస్తానని హామీ ఇచ్చారు. పదేళ్ల కాలంలో ఇచ్చిన హామీ నెరవేరలేదని గ్రామస్థులు తెలిపారు. అదేవిధంగా ఉల్లంపల్లి నుంచి తుమ్మలపల్లి వరకు ఉన్న మట్టి రోడ్డును బీటీ రోడ్డుగా కూడా మార్చాలని తెలిపారు. ఈ రెండు రోడ్లు బాగా లేక వేరే పోల్కంపల్లికి వెళ్లి రోడ్డు నుంచి చుట్టూ తిరిగి ఉల్లంపల్లికి రావాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని ప్రజలు తెలిపారు. మండల కేంద్రంలో ప్రభుత్వ పాఠశాల నుంచి ఎస్సీ కాలనీ వరకు వెళ్లే దారి వర్షం రావడం వల్ల గుంతలమయంగా మారడంతో వాహనదారులు కింద పడుతున్న సందర్భాలు చాలా ఉన్నాయని కాలనీవాసులు తెలిపారు. అరుజనవాడలో సీసీ రోడ్లు లేక మట్టి రోడ్లు గుంతల మయంగా మారి ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని మమ్మల్ని పట్టించుకునే నాధుడు లేడని వారు ఆవేదన వ్యక్తం చేశారు. సర్వారెడ్డిపల్లి నుంచి నర్సంపల్లికి వెళ్లే రోడ్డు మట్టి రోడ్డు కావడంతో పెద్దపెద్ద గోతులు పడి వాహనాలకి కాదు మనుషులు కూడా పోరాకుండా అధ్వానంగా మారిందని ఆ గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నర్సంపల్లి గ్రామస్తులు ఇటు సర్వారెడ్డిపల్లికి రావడానికి ఇబ్బంది ఆటు కోనేటిపూర్ మీద నుంచి డిండికి పోవడానికి కూడా ఇబ్బంది ఉందని, రెండు ఊర్ల మధ్య ఉండి రోడ్లు లేక ఇబ్బందులు ఎదుర్కోక తప్పడం లేదని తెలిపారు. వంగూరు గేటు నుంచి జూపల్లికి వెళ్లే 5 కిలోమీటర్ల మట్టి రోడ్డు కూడా చినుకు పడితే చిత్తడితో పెద్దపెద్ద గుంతలుగా మారి మరమ్మతులకు నోచుకోవడం లేదని, రెండు మండలాలను కలిపే అత్యంత కీలకమైన ఈ రోడ్డును ఎన్నో ఏండ్ల నుండి ఇద్దరు కల్వకుర్తి అచ్చంపేట ఎమ్మెల్యేల మధ్య పోటీపడో ఏమో కానీ ఇప్పటి వరకు ఆ రోడ్డుకు మోక్షం రాలేదని తెలిపారు. సీఎం సొంత మండలంలోనే రోడ్ల పరిస్థితి ఇలా ఉంటే ఎట్లా అని పలు గ్రామాల ప్రజలు చర్చించుకుంటున్నారు. ఇప్పటికైనా ఈ ప్రభుత్వంలో ఉన్న ఎమ్మెల్యే, ప్రజా ప్రతినిధులు, అధికారులు చొరవ తీసుకుని ఈ రోడ్ల మరమ్మతులు వెంటనే చేపట్టాలని పలు గ్రామాల ప్రజలు కోరుతున్నారు.



రెండో విడత రుణమాఫీ : కలెక్టర్

- కలెక్టరేట్‌లో రైతులకు లాంఛనంగా చెక్కుల అందజేత
- అర్హులైన రైతులందరికీ రూ.2లక్షల వరకు రుణమాఫీ
- పండుగలా రైతు రుణమాఫీ మలివిడత నిధుల విడుదల



నవతెలంగాణ-కందనూలు

ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో రెండోసారి రైతు రుణమాఫీ నిధులు రైతుల ఖాతాల్లో రాష్ట్ర ప్రభుత్వం వేసింది. రెండోసారి లబ్ధి పొందిన రైతులు ఈ సందర్భంగా ఆనందం వ్యక్తం చేస్తుండగా రూ.2లక్షల రుణమాఫీ కాని వారు మూడో దఫా రుణమాఫీ కోసం ఎదురుచూస్తున్నారు. జిల్లా కలెక్టర్లు వ్యవసాయ అధికారులు రైతుల సమక్షంలో ఈ రుణమాఫీ చెక్కులను కలెక్టర్లు కొంతమందికి అందజేశారు. మిగతా వారికి బ్యాంకులో ఆయా ఖాతాదారులలో డబ్బులు జమ అవుతాయని అధికారులు చెబుతున్నారు. మంగళవారం రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న రైతు రుణమాఫీ-2024 మలివిడత నిధుల విడుదల అట్టహాసంగా చేశారు. రాష్ట్ర ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి హైదరాబాద్ నుండి ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, శాసనసభ స్పీకర్ ప్రసాద్, శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, వ్యవసాయ శాఖా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఇతర మంత్రులు, ఉన్నతాధికారులతో కలిసి రుణమాఫీ నిధులను విడుదల చేయగా, సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం (కలెక్టరేట్)లోని ప్రధాన సమావేశ మందిరాలలో కలెక్టర్లు రైతులకు చక్రం అందజేశారు. కలెక్టర్ బాదావత్ సంతోష్, అధ్యక్షతన లబ్దిదారులైన రైతులు, వ్యవసాయ, సహకార శాఖల అధికారులు, బ్యాంకర్లు, సహకార సంఘాల చైర్మన్లు, స్థానిక ప్రజాప్రతినిధులు ప్రత్యక్ష ప్రసారం ద్వారా వీక్షించి, ముఖ్యమంత్రి సందేశాన్ని తిలకించారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి జిల్లా పాలనాధికారులు లబ్దిదారులైన పలువురు రైతులకు రెండో విడత రుణమాఫీకి సంబంధించిన చెక్కులను లాంఛనంగా అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రుణమాఫీ ద్వారా అర్హులైన ప్రతి రైతు ప్రయోజనం పొందేలా బ్యాంకర్లు, వ్యవసాయ అధికారులు అన్నదాతలకు తోడ్పా టును అందించాలని ఆదేశించారు. ఏ ఒక్క రైతు అసౌకర్యానికి గురికాకుండా చూడాల్సిన బాధ్యత క్షేత్రస్థాయి అధికారులదేనని స్పష్టం చేశారు. ప్రస్తుతం ప్రభుత్వం విడుదల చేసిన మలివిడత రుణమాఫీ నిధులను రెండు రోజుల్లోపు రైతుల ఖాతాలలో అందుబాటులో ఉండేలా చూడాలని, వారు తమ అవసరాల కోసం ఆ నిధులను వినియోగించుకునేలా చొరవ చూపాలని బ్యాంకర్లకు సూచించారు. తొలి, మలివిడతలలో రుణమాఫీ పొందిన రైతులందరికీ జిల్లా యంత్రాంగం తరపున శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం రైతులు మాట్లాడుతూ తమకు రుణ విముక్తి కల్పించిన ప్రభుత్వానికి, అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి చంద్రశేఖర్, లీడ్ బ్యాంకు మేనేజర్, శ్రీనివాస్ రావు, నాగర్‌కర్నూల్ పీఏసీఎస్ ప్రెసిడెంట్ శ్రీనివాస్ రెడ్డి, డీసీసీబీ డైరెక్టర్ భూపాల్‌రావు, రంగాపూర్ పీఏసీఎస్ ప్రెసిడెంట్ సురేందర్ రెడ్డి, ఎస్‌బీఐ నాగర్‌కర్నూల్ మేనేజర్ గురుప్రసాద్, ఏపీజీవీబీ రీజినల్ మేనేజర్ రంజిత్, బ్యాంక్ అధికారులు, మండల వ్యవసాయ అధికారులు, రైతులు, రుణమాఫీ లబ్ధిదారులు పాల్గొన్నారు.

బీసీ కాలనీ సమస్యలు పరిష్కరించాలి

- సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి పర్వతాలు



నవ తెలంగాణ-కందనూలు

నాగర్‌కర్నూల్ పట్టణంలోని 17వ వార్డు బీసీ కాలనీ సమస్యలు పరిష్కరించాలని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి పర్వతాలు డిమాండ్ చేశారు. మంగళవారం సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో ఆర్డీవోకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లోకాయుక్తలో ఉన్న కేసును త్వరగా పరిష్కరించి కాలనీ లో నిర్మించుకున్న ప్రతి ఇంటికి ఇంటి నెంబర్ ఇవ్వాలని కోరారు. కాలనీలో తీవ్రమైన సమస్యలు ఉన్నాయని, కనీస సౌకర్యాలు కూడా లేవన్నారు. రోడ్లు, వీధి దీపాలు వేయాలని, పీహెచ్‌సీ సెంటర్‌ను, అంగన్వాడీ కేంద్రాన్ని నిర్మించా లని ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేసి, మిషన్ భగీరథ మంచినీరు అందించి, బ్లీచింగ్ పౌడర్ చల్లాలని డిమాండ్ చేశారు. కాలనీకి వెళ్లాలంటే ప్రధాన రహదారి లేదని శ్రీపురం రోడ్డు నాగనూరు రోడ్డుకు లింకు రోడ్డును ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఆర్.శ్రీనివాస్. మాజీ ఎంపీటీసీలు గీత, యాదయ్య, మండల కార్యదర్శి అశోక్, రామయ్య సత్యనారాయణ, సురేష్, శివరాములు, రాజేష్ పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేయాలి

- బీఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర కార్యదర్శి బి.దాస్



నవతెలంగాణ-కొల్లాపూర్ రూరల్

మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేయాలని బీఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర కార్యదర్శి బి.దాస్, కొల్లాపూర్ నియోజకవర్గ బీసీ విద్యార్థి నాయకుడు భరత్ కుమార్ డిమాండ్ చేశారు. మంగళవారం మండల పరిధిలోని సింగోటం గ్రామంలో ప్రభుత్వ పాఠశాలను సందర్శించిన విద్యార్థి నాయకులు ప్రభుత్వ పాఠశాల ముందర విద్యార్థులతో నిరసన వ్యక్తం చేశారు. గత రెండు నెలలుగా మధ్యాహ్న భోజనం విద్యార్థులకు పెట్టడం లేదన్నారు. మధ్యాహ్న భోజన వంట కార్మికులకు సరైన సమయంలో జీతాలు అందక, అలాగే జీతాలు తక్కువగా ఉండడం చేత గ్రామంలో ఉన్న మహిళా సంఘాలు, ఎవరు కూడా మధ్యాహ్న భోజనం వండటానికి రావటం లేదన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి మధ్యా హ్న భోజన కార్మికులను నియమించాలని వారు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఇకనైనా ప్రభుత్వం స్పందించి మెరుగైన వసతులు ప్రభుత్వ పాఠశాలలో కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలను పరిష్కరించండి

- సీపీఐ(ఎం) జిల్లా నాయకులు ఈశ్వర్





నవతెలంగాణ-పెంట్లవెలి

మండలంలో ప్రజలు నిత్యం ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కారం చేయాలని సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. అనంతరం వివిధ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్ ప్రభాకర్‌కు అందించారు. ఈ సందర్భంగా సీపీఐ(ఎం) జిల్లా నాయకులు ఈశ్వర్ మాట్లాడుతూ మండలంలోని కొండూరు గ్రామ పరిధిలో తూముకుంట నుంచి వచ్చే వాగును ఊర చెరువ కలపాలన్నారు. అలాగే ఈ ఊర్లో ఒకరి పేరు మీద ఉన్న భూములు మరొకరు సాగులో ఉన్న పరిస్థితి నెలకొందని ఈ సమస్యలను పరిష్కారం చేయాలన్నారు. అలాగే తడకల వారి తండా, జాలు బావి తాండ, మంచాలకట్ట, మాధవస్వామి నగర్, మల్లేశ్వర గ్రామాలకు బస్సు సౌకర్యాని కల్పించాలన్నారు. జటప్రోలులో సర్వే నెంబర్ 177లోని భూమిని ఇళ్ల స్థలాలు లేని పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలన్నారు. అలాగే కొత్త కాలనీలో మంచి నీటి ట్యాంక్‌ను నిర్మించాలన్నారు. సింగవరంలో మంచినీటి బోరు చెడిపోయిందని దానిని తక్షణమే బాగు చేయించి గ్రామానికి మంచినీరు సరఫరా చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అలాగే గోపులాపురంలో ఇండ్ల మధ్యలో ఉన్న డంపింగ్ యార్డ్‌ను ఊరికి దూరంగా తరలించాలన్నారు. జూరాల శివరాయికట్టుకు సాగునీరు అందించి నీటిని విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఏంగంపల్లి తండాలో సర్వే నెంబర్ 301లో ఇళ్ల స్థలాలకు భూమిని ఇచ్చారని, కానీ ఇంతవరకు పంపిణీ చేయలేదన్నారు. తక్షణమే పంపిణీ చేయాలని వారు కోరారు. మండల కేంద్రంలో మహంకాలమ్మ మెట్ట దగ్గర ఇళ్ల స్థలాలు లేని పేదలందరికీ ఇళ్ల స్థలాలు ఇవ్వాలని, అలాగే మంచాలకట్ట ఎత్తిపోతుల పథకం ద్వారా మల్లేశ్వరం, మంచాలకట్ట, మాధవ స్వామి నగర్, ఏంగంపల్లి తాండ ప్రజలకు సాగునీరు అందించాలని, గ్రామాలలో 30ఏళ్ల క్రితం నాటిన కరెంటు స్తంభాలే నేటికి పాత కరెంటు స్తంభాలుగా ఉన్నాయని, ఎప్పుడు పడిపోతాయో తెలియని స్థితిలో ఉన్నాయని కొత్త కరెంటు స్తంభాలను చేసి వీధిలైట్లు ఏర్పాటు చేయాలని, డ్రైనేజీ వ్యవస్థ లేక రోడ్లపైన మురుగునీరు ప్రవహిస్తూ ఉందన్నారు. దీనివలన ప్రజలు రోగాల బారిన పడే అవకాశం ఉందన్నారు. దోమలు వృద్ధి చెందుతాయని, వీటి నివారణకు బ్లీచింగ్ పౌడర్ చలాలన్నారు. అలాగే గ్రామాలలో మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేయాలని, గ్యాస్ కనెక్షన్లు యాజమాన్యం చనిపోతే వేరే వారు పేరు ఎక్కించుకోవడం లేదు. కాబట్టి వారి కుటుంబ సభ్యులకు ఎక్కించుకునే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. నూతన పెన్షన్లకు శ్రీకారం చుట్టాలని, నూతన రేషన్ కార్డులను ప్రజలకు అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) మండల నాయకులు హనుమంతు, ఎల్ల గౌడ్, తిమ్మ స్వామి, గోపాలు, గోవిందమ్మ, గుండమ్మ, లక్ష్మన్న పాల్గొన్నారు.

తెలకపల్లి : మండలంలోని పలు గ్రామాలలో నెలకొన్న మౌలిక సమస్యలను వెంటనే పరిష్కరించాలని సీపీఐ(ఎం) మండల కార్యదర్శి నందిపేట భాస్కర్ అన్నారు. మంగళవారం సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో ప్రజా సమస్యల అధ్యయన యాత్రలో భాగంగా మండల పరిధిలోని పెద్దూరులో సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలోని మండలి బక్కయ్య ఇంటి నుండి మాధవరెడ్డి ఇంటి పక్కన ఎల్లమ్మ గుడికి పోయే మురుగు కాలువ పూర్తిగా మధ్యలో ఉండడంతో గ్రామంలో మురుగు నీరు వర్షం నీరు మురుగు కాలువ గుండా ప్రవహిస్తుందన్నారు. దీంతో పరిసర ప్రాంతాలు కలుషితం అవుతున్నాయన్నారు. ఎస్సీ కాలనీలోని సీసీరోడ్లు, అండర్ డ్రైనేజ్ వ్యవస్థ లేకపోవడంతో ఇండ్లలోకి మురుగు వస్తుందని, ఎస్సీ సబ్ ప్లాన్ ఉన్నా అభివృద్ధికి నోచుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామంలో ప్రధాన రహదారుల వెంబడి 15 ఐమాక్స్ లైట్లు ఉన్నా ఐదు మాత్రమే పని చేస్తున్నాయని మిగతా వాటికి లోవోల్టేజీల పేరుతో అధికారులు కనెక్షన్లు నిలిపివేశారన్నారు.అలాగే ఇతర గ్రామాలకు నిత్యం వాహనాలు రాకపోకలు జరుగుతాయని వీధి లైట్లు లేకపోవడంతో రాత్రి వేళల్లో రోడ్లపైన విష సర్పాలు సంచరించడంతో ప్రయాణికులు ప్రజలు భయాందోళనకు గురవుతున్నారన్నారు. గ్రామాలలో నెలకొన్న సమస్యలపై అధికారులు స్పందించి తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేదంటే మండల కేంద్రాల్లో ధర్నాలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో కొంగరి కాశన్న, రామకృష్ణ, గ్రామస్తులు బాలయ్య, కాశమ్మ, నారమ్మ పాల్గొన్నారు

అద్దె వాహనాల బకాయిలను చెల్లించాలి

- తెలంగాణ ఫోర్ వీలర్స్ ఉమ్మడి జిల్లా అధ్యక్షులు అబ్దుల్ ఖాదర్



నవతెలంగాణ-కందనూలు

నాగర్‌కర్నూల్ జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థలో వినియోగించిన అద్దె వాహనాల బకాయిలను వెంటనే చెల్లించాలని తెలంగాణ ఫోర్ వీలర్ డ్రైవర్స్ అసోసియేషన్ (టీఎఫ్‌డబ్ల్యూడీఏ) ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా అధ్యక్షులు అబ్దుల్ ఖాదర్ డిమాండ్ చేశారు. మంగళవారం నాగర్‌కర్నూల్ జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ శాఖలకు చెందిన బిల్లులు కనీసం 10నెలల నుంచి పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని వెంటనే విడుదల చేయాలని డీఆర్డీఏ పీడీ చిన్న ఓబులేష్‌కు ఫోర్ వీలర్ అసోసియేషన్ నుండి వినతి పత్రాన్ని అందజేశారు.ఆయన వెంట అసోసియేషన్ నాయకులు తదితరులు ఉన్నారు.

ట్రాక్టర్ బోల్తా పడి రైతు మృతి



నవతెలంగాణ-వంగూరు

మండల కేంద్రానికి చెందిన మీసాల లక్ష్మయ్య అనే రైతు తన వ్యవసాయ పొలంలో ట్రాక్టర్ తో కరిగేట్ దున్నుతున్న సమయంలో ప్రమాదవశాత్ ట్రాక్టర్ బోల్తా పడడంతో దాని కింద పడి మృతి చెందిన సంఘటన చోటు చేసుకున్నది. కుటుంబీకులు తెలిపిన వివరాల ప్రకా రం రోజు మాదిరిగానే తన వ్యవసాయ పొలంలో ట్రాక్టర్‌తో కరిగేటు దుంతుం డగా ట్రాక్టర్ బురదలో దిగబడడంతో తీయటానికి ప్రయత్నిస్తుండగా ప్రమాదవ శాత్తు ట్రాక్టర్ మీద పడి అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన చోటు చేసుకు న్నదని తెలిపారు. మృతునికి భార్య ఇద్దరు కొడుకులు, ఒక కూతురు ఉన్నారు.

స్ట్రెస్ మేనేజ్మెంట్‌పై విద్యార్థులకు అవగాహన



నవతెలంగాణ- నాగర్‌కర్నూల్ రూరల్

జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో స్ట్రెస్ మేనేజ్మెంట్, మానసిక రుగ్మతలపై నాగర్ కర్నూల్ ఏరియా హాస్పిటల్ సైక్రియాటిస్ట్ డాక్టర్ జ్యోతి అవగాహన సమావేశం నిర్వహించి విద్యార్థులకు పలు సూచనలు, సలహాలు చేశారు. ఈ సందర్భంగా మంచి ఆలోచనలు కలిగి, ప్రణాళిక బద్ధంగా జీవన విధానాన్ని అలవర్చుకోవడం వల్ల స్ట్రెస్, డిప్రెషన్, యాంగ్జైటీని అధిగమించవచ్చని డాక్టర్ జ్యోతి సూచించారు. విద్యార్థులు దిన సరి ప్రణాళికలో ఉల్లాసంగా సమయ పాలన, దినచర్యను ప్రారంభించి, ఏకాగ్రతతో మానసిక ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని చెప్పారు. దేహదారుడ్యాన్ని కాపాడేది వ్యాయామం అయితే, మానసిక ఆరోగ్యం కొరకు, స్ట్రెస్ మేనేజ్మెంట్ నిర్వాణ కొరకు విజ్ఞానంతో కూడిన మంచి అలవాట్లు, సమయానికి నిద్రించడం, ధూమపానం, మాదకద్రవ్యాలకు దూరంగా ఉంటూ నిర్ణీత సమయానికి పౌష్టికాహార భోజనం చేయడం వల్ల ఆరోగ్య సమస్యలను అధిగమించవచ్చని, ప్రాణామాయం లాంటి "శ్వాసతో ధ్యాస" చేయడం వల్ల డిప్రెషన్‌కు లోనుకాకుండా చక్కటి జీవనశైలిని ఈ వయసు నుండే అలవర్చుకోవచ్చని అన్నారు. విద్యార్థులకు ఏమైనా మానసిక సమస్యలు ఉన్నట్లయితే 14416 టోల్ ఫ్రీ నంబర్‌ను సంప్రదించాలని చెప్పారు. ఈ కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపల్ శ్రీమతి జి మాధవి అధ్యక్షత వహించగా జిల్లా వైద్యాధికారి కార్యాలయ ప్రోగ్రామ్ ఫీసర్ కృష్ణమోహన్, డిస్ట్రిక్ట్ ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ విజయ్ కుమార్ పాల్గొని విద్యార్థులతో పాలు ఇంటరాక్షన్ కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల సీనియర్ అధ్యాపకులు బగవేని నరసింహులు, లైబ్రేరియన్ రవీందర్ రెడ్డి, రవి ప్రకాష్, సత్యం, వెంకట్ రెడ్డి, హరిత, శిరీష, హిప్సా, తస్కీన్, కుర్షిత్ బేగం, రాజయ్య, ప్రసన్నలక్ష్మి, పరమేశ్వరి, కిరణ్, చంద్రశేఖర్, రాణి అరుంధతి ఇతర బోధ నేతల సిబ్బంది పాల్గొన్నారు.

అక్రమ అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరు : సీపీఐ(ఎం)



నవతెలంగాణ-కొల్లాపూర్ రూరల్

కొల్లాపూర్ మండలంలో బుధవారం చలో అసెంబ్లీ ముట్టడికి ఆశ వర్కర్స్, గ్రామ పంచాయతీ వర్కర్స్ వెళ్లకుండా అక్రమ అరెస్టులు చేశారు. ఈ సందర్భం గా బి.శివ వర్మ, మల్లేష్ మాట్లాడుతూ ఈ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయాలని తమ సంఘాల ఆధ్వర్యంలో చలో అసెంబ్లీకి పిలుపునిస్తే సమస్యలు సానుకూలంగా పరిష్కరించాల్సిన ప్రభుత్వం అక్రమ అరెస్టులు చేయడం దారుణమన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం తమ సమస్యలు పరిష్కరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆశ కార్యకర్తలు, గ్రామ పంచాయతీ వర్కర్లు పాల్గొన్నారు.



ఉప్పునుంతల : గ్రామపంచాయతీ కార్మికులు చలో హైదరాబాద్ మహా ధర్నాకు మండలం పరిధిలోని గ్రామపంచాయతీ కార్మికులు మంగళవారం తరలి వెళ్తుండగా పోలీసు శాఖ ఎస్సై లెనిన్ గ్రామ పంచాయతీ సిబ్బందిని అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

నామమాత్రంగా సామాజిక తనిఖీలు

- నేడు బల్మూరులో 14వ విడత



నవతెలంగాణ - బల్మూరు

జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పనుల సామాజిక తనిఖీలు నామమాత్రంగా జరుగుతున్నాయని ఈసారైనా పకడ్బందీగా సామాజిక తనిఖీలు నిర్వ హించాలని మండల ప్రజలు కోరుతున్నారు. నేడు మండల కేంద్రంలో మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో 14వ విడత సామాజిక తనిఖీ నిర్వహిస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఉపాధి పనులలో అనేక అవకతవకలు జరుగుతున్నాయని వాటిని నివారించేందుకు సామాజిక తనిఖీలు చేపడుతున్నట్లు ప్రభుత్వం అధికారులు చెపుతున్నప్పటికీ అవకత వకలు జరుగుతూనే ఉన్నాయని ఆరోపణలు వినిపి స్తున్నాయని మండల ప్రజలు విచారం వ్యక్తం చేస్తు న్నారు. ఒక రకంగా ఉపాధి హామీ చట్టాన్ని కొందరు నిర్వీర్యం చేసేందుకే ఉపాధి హామీ పథకం పనులను లోపభూయిష్టంగా నిర్వహిస్తున్నారని అందుకే ఎవరికి తోచిన విధంగా వారు, వారితో పాటు అధికారులు సైతం వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గతంలో జరిగిన సామాజిక తనిఖీలలో అవకత వకలు అక్రమాలు బయట పడినప్పటికీ.. సంబంధిత సిబ్బందిపై ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఆరోపణలు వినిపిస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నా రు. ఇప్పుడు జరిగే సామాజిక తనిఖీ లోనైనా నిష్పక్షపాతంగా సామాజిక తనిఖీ నిర్వహించాలని అక్రమాలకు పాల్పడిన సంబంధిత సిబ్బందిపై చర్యలు తీసుకొని, ఉపాధి హామీ పథకం సక్రమంగా కొన సాగేలా చూడాలని మండల ప్రజలు కోరుతున్నారు. అవినీతి అక్రమాలకు పాల్పడిన సిబ్బందిపై రికవరీ పేరుతో మళ్లీ వసూలు చేస్తున్నామంటూ అధికారులు అప్పటికి చెబుతున్నప్పటికీ ఏ మేరకు రికవరీ అవుతుందో కూడా సామాజిక తనిఖీలు గతంలో జరిగిన రికవరీలను వివరించాలని ప్రజల కోరుతున్నారు.

నవతెలంగాణ

4

నారాయణపేట

బుధవారం | జులై 31, 2024 | www.navatelangana.com



ముఖ్యమంత్రి చిత్రపటాని పాలభిషేకం

నవతెలంగాణ-ఊట్కూర్

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రైతులకు ఇచ్చిన మాట ప్రకారంగా 1,50,000 రైతుల రుణమాఫీ వారి ఖాతాలో వేయడంతో మండల కేంద్రమైన ఊట్కూర్‌లో రైతులు కాంగ్రెస్ నాయకులు హర్షం వ్యక్తం చేస్తూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క, రైతు వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి చిత్రపటానికి పలాబిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు విగ్నేశ్వర్ రెడ్డి, టౌన్ అధ్యక్షుడు కోక్కు లింగం, ఊట్కూర్ గ్రామ మాజీ సర్పంచ్ సూర్యప్రకాశ్ రెడ్డి, కాంగ్రెస్ మండల నాయకులు ఎల్కోటి లక్ష్మీకాంత్ రెడ్డి, కాంగ్రెస్ మైనార్టీ మండల నాయకులు జలాల్, కొక్కు శంకర్, సీనియర్ నాయకులు బషీర్, మొహమ్మద్ అరాఫత్, సందాపూర్ రవి, మల్లేపల్లి అశోక్, కోరం మహేష్, యాదయ్య, తదితరులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



నవతెలంగాణ-ధన్వాడ

మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలని మధ్యాన భోజన పథకం తెలంగాణ రాష్ట్ర సభ్యుడు ఝూడే.నాందేవ్ అన్నారు. మంగళవారం రాష్ట్ర యూనియన్ ఆధ్వరంలో బుధవారం ఛలో హైదరాబాద్ కార్యక్రమానికి పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 22ఏళ్ల క్రితం పాఠశాలల్లో మధ్యాన భోజన పథకం ప్రారంభించిన రోజు నుండి కేవలం రూ.వెయ్యి వేతనంతో వంటలు చేసి పిలల్లకు వడ్డీస్తున్నామన్నారు. అనేక పోరాటాల అనంతరం గత ప్రభుత్వం రూ.2వేలకు పెంచిందని, కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల మ్యానిపెస్టోలో పెట్టిన రూ.10వేలు వేతనం చెల్లించాలని, వంట కార్మికులకు ప్రభుత్వమే కోడిగుడ్లు సరఫరా చేయాలని, ప్రస్తుతం ఇస్తున్నా మెను చార్జీలు సరిపోవడం లేదన్నారు. మెను చార్జీలు రూ.25లకు పెంచాలని, అదే విధంగా గ్యాస్, వంట సరుకులు మొత్తం ప్రభుత్వమే సరఫరా చేయాలన్నారు. డిసెంబరు నుంచి ఉన్న పెండింగ్ బిల్లులు వెంటేనే విడుదల చేయాలని కోరారు. కార్యక్రమంలో ఝూడే.తాయిబాయి, శివాబాయి, సులోచన బాయి, గెడం జైతుబాయి, లక్ష్మి బాయి, మున్నాబాయి పాల్గొన్నారు.

బీసీలను మోసం చేసిన రాష్ట్ర ప్రభుత్వం

- బీసీసేనా ఉమ్మడి జిల్లా అధ్యక్షులు వెంకటేష్ యాదవ్



మక్తల్ : రాష్ట్ర బప్రభుత్వం బీసీలను మోసం చేసిందని బీసీసేనా ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు వెంకటేష్ యాదవ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కామారెడ్డి నియోజకవర్గం కేంద్రంలో ఎన్నికల ప్రచారంలో బిసి డిక్లరేషన్ ప్రకటించి ఓట్లతో అధికారంలోకి వచ్చిన రేవంత్ రెడ్డి అసెంబ్లీ సీట్ల కేటాయింపు నుండి, బడ్జెట్ కేటాయింపు వరకు అడుగడుగునా బీసీలను దగా చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. 2 లక్షల 91 వేల 191 వందల కోట్ల బడ్జెట్‌లో కేవలం 9వేల 200కోట్ల బడ్జెట్ కేటాయించి 60శాతం ఉన్న బీసీలకు 3శాతం లోపే బడ్జెట్ కేటాయించి బీసీలను అభివృద్ధికి దూరం చేశారని మండిపడ్డారు. మహాత్మా జ్యోతిబా పూలే బీసీ సబ్ ప్లాన్ ఏర్పాటు చేసి ప్రతి వార్షిక బడ్జెట్‌లో రూ.20వేల కోట్ల బడ్జెట్ కేటాయించి బీసీల అభ్యున్నతికి పాటుపడతామని బీసీలను నమ్మించి మోసగించారన్నారు. బీసీ కుల గణన చేపట్టి స్థానిక సంస్థల ఎన్నికలలో 42శాతం రిజర్వేషన్ కల్పించిన తర్వాతే ఎన్నికలు నిర్వహించాలని, లేనియెడల వచ్చే స్థానిక సంస్థల ఎన్నికలలో తగిన బుద్ధి చెప్పాలని బీసీ శ్రేణులకు పిలుపునిచ్చారు. బీసీ కార్పొరేషన్, బీసీ ఫెడరేషన్‌లకు 50వేల కోట్ల బడ్జెట్ కేటాయించి బీసీ బంధు పథకం ద్వారా రాష్ట్రంలోని ప్రతి బీసీ కుటుంబానికి 100శాతం రాయితీతో నగదు అందించి ప్రోత్సహించాలని డిమాండ్ చేశారు. ఆసరా పింఛన్ రూ.4వేలకు పెంచాలని, ఆటో డ్రైవర్‌లకు, వ్యవసాయ కూలీలకు ఇచ్చిన హామీ మేరకు సంవత్సరాని రూ.12 వేలు వారి ఖాతాలో జమ చేయాలని, తక్షణమే రైతు భరోసాలు నిధులు విడుదల చేయాలని లేనియెడల రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు చేపడతామని రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో అన్నదానం



నవతెలంగాణ - మక్తల్

లయన్స్ క్లబ్ మఖ్తల్ భీమా ఆధ్వర్యంలో ఇంటర్నేషనల్ డైరెక్టర్ లయన్ బాబూరావు పీయంజేయఫ్ జన్మదినం పురస్కరించుకొని పడమటి ఆంజనేయ స్వామి ఆలయ ప్రాంగణంలో అన్నప్రసాద వితరణ చేసినట్లు అధ్యక్షుడు డీవీ.చారి తెలిపారు. ఈ కార్యక్రమంలో కోశాధికారి అంజన్ ప్రసాద్, రమేష్ రావు, అంబాదాస్, అనుగొండ శ్రీనివాసులు, కట్టా వెంకటేష్, నాగరాజ్, మఠం వాదిరాజ్, శరణప్ప తదితరులు పాల్గొన్నారు.

ఊట్కూర్ : ఇంటర్నేషనల్ డైరెక్టర్ లయన్ మట్టమనేని బాబురావు జన్మదినం సందర్భంగా మండల కేంద్రంలో మంగళవారం లయన్ క్లబ్ వారి ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. ఈ సందర్భంగా లయన్ క్లబ్ సభ్యులు మాట్లాడుతూ అన్నదానం చేయాలని డిస్ట్రిక్ట్ గవర్నర్ డాక్టర్ కోటేశ్వరరావు సూచనల మేరకు నిర్వహించామన్నారు. ఈ కార్యక్రమంలో లయన్ క్లబ్ సెక్రెటరీ వసంత్, ఉపాధ్యక్షులు దొబ్బలి హనుమంతు, సభ్యులు సూర్య ప్రకాష్ రెడ్డి, నరసింహ, రాజు, శంకర్, తదితరులు పాల్గొన్నారు.

పీఆర్టీయూ టీఎస్ సభ్యత్వ నమోదు

నవతెలంగాణ - నారాయణపేట

పీఆర్టీయూ టీఎస్ నారాయణపేట మండలం అధ్యక్షులు ఎం.రఘువీర్ ఆధ్వర్యంలో జడ్పీహెచ్ఎస్ కొల్లంపల్లి, జడ్పీహెచ్ఎస్ జాజపూర్, యూపీఎస్ చిన్న జట్రం, ప్రాథమిక పాఠశాలలు కొల్లంపల్లి, లక్ష్మీపూర్, శిఖరమోని తండా, వండర్ గుట్ట తండా, నల్లగుట్ట తండా, పాతతండా పాఠశాలలో సభ్యత నమోదు వారోత్సవాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి యాదగిరి, జనార్ధన్ రెడ్డి, నారాయణపేట మండల అధ్యక్షులు రఘువీర్, ప్రధాన కార్యదర్శి జనార్ధన్‌లు పాల్గొన్నారు. సభ్యత్వ నమోదులో ప్రతి పాఠశాలలో ఉపాధ్యాయులు సంఘంపై విశ్వాసంతో ముందుకు వచ్చి క్రియాశీలక సభ్యత్వాన్ని జిల్లా ప్రధాన కార్యదర్శి యాదగిరి, జనార్ధన్ రెడ్డి చేతుల మీదుగా స్వీకరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉమ్మడి ఏకీకృత సర్వీసు రూల్స్‌ను సాధించి ఉపాధ్యాయులకు ఎంఈఓలు, జేఎల్, డైట్ లెక్చరర్‌గా ప్రమోషన్లను ఇప్పిస్తాం, పెండింగ్‌లో ఉన్నటు వంటి 5 డీఏలను, మంచి ఫిట్మెంట్‌తో పీఆర్సీలను ఇప్పిస్తాం, 317 జీవో ద్వారా అదనపు క్యాడర్ స్ట్రెంత్‌లో ఏర్పడ్డ సమస్యలు ప్రభుత్వం వెంటనే పరిష్కరించే విధంగా కృషి చేస్తామని, ఎస్జీటీ ఉపాధ్యాయులకు తక్షణమే 5,500ల పీఎస్ హెచ్ఎం పోస్టులను రాష్ట్ర ప్రభుత్వం చేత క్రియేట్ చేపించి ప్రమోషన్లు ఇప్పిస్తామని, ఇతర సమస్యల సాధన కోసం పీఆర్టీయూ టీఎస్ ఉపాధ్యాయుల పక్షాన పోరాడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు కే.శ్రీనివాస్, ఆయా పాఠశాల జీహెచ్ఎంలు అన్నపూర్ణ, భారతి, డీఎస్ఓ భాను ప్రకాష్, ఆయా పాఠశాల హెచ్ఎంలు మహేష్, భీమేశ్వరి, నగేష్, కురుమూర్తి, శ్రీవాణి, రేష్మ, ఆయా పాఠశాల టీచర్లు సొల్మన్ రాజు, రజిత, లతీఫుద్దీన్ నిజాం, కవిత, శశిరేఖ, నిర్మల, శిరీష, శ్రీదేవి, మంగళ, మధుసూదన్, ప్రతాప్, నర్సిములు తదితరులు పాల్గొన్నారు.

రక్తదాన శిబిరాన్ని ప్రారంభం



నవతెలంగాణ - నారాయణపేట

జిల్లా కేంద్రంలోని సిటిజన్ క్లబ్‌లో మంగళవారం జిల్లా యువశక్తి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ఎస్పీ యోగే ష్ గౌతమ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రక్తదానం మహాదానం అని, తలసేమియా, క్యాన్సర్, మెడికల్ ఎమర్జె న్సీ పేషెంట్లు, ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వారికి ఎక్కువగా రక్తం అవసరం ఉంటుందని, అలాంటి వారికి రక్త దానం చేయడం అనేది ఒక గొప్ప సామాజిక సేవా అన్నారు. జిల్లాలోనే కాకుండా రాష్ట్రవ్యాప్తంగా యువశక్తి ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్వచ్ఛందంగా రక్తదానం చేయడం, పేద విద్యార్థులకు అందిస్తున్న సేవలు, పేదలకు నిత్యవసర సరుకులు అందజేయడం వంటి సేవలు ఎంతో అభినందనీయమని యువశక్తి ఫౌండేషన్ టీమ్‌ని ఎస్పీ అభినందించారు. యువత సేవా మార్గంలో నడవాలని ఇతరులకు సహాయం చేయాలని సేవాగుణం కలిగి ఉండాలని యువశక్తి ఫౌండేషన్ స్ఫూర్తి గా తీసుకొని ప్రతి ఒక్కరూ సేవా భావంతో మెలగాలని ఎస్పీ తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ ఎన్.లింగయ్య, ఎస్ఐ వెంకటేశ్వర్లు, యువశక్తి ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు కాగితాల మధు, జిల్లా ఫౌండేషన్ ప్రెసిడెంట్ ప్రవీణ్, డైరెక్టర్ గణేష్, మనోజ్, శివ, నవీన్, యువకులు పాల్గొన్నారు.

రెండో విడత రుణమాఫీ నిధుల విడుదల : కలెక్టర్



నవతెలంగాణ - నారాయణపేట

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ రంగానికి అధిక ప్రాధాన్యతనిచ్చి రైతుల మేలు కోసం ప్రత్యేకంగా రుణ మాఫీ పథకం తెచ్చిందని కలెక్టర్ సిక్తా పట్నాయక్ అన్నారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశం హాలులో రైతు రుణ మాఫీ 2024 రెండో విడత, నిధులు విడుదల నిర్వహించారు. రాష్ట్ర శాసనసభ ప్రాంగణం నుండి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రెండవ విడత ఋణమాఫీ నిధుల విడుదల ప్రకటన ప్రత్యక్ష ప్రసారాన్ని విక్షించారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్, అదనపు కలెక్టర్ మయాంక్ మిత్తల్ రైతులను ఉద్దేశించి రైతు రుణమాఫీ పథకాన్ని గురించి మాట్లాడారు. మొదటి విడతగా 28,684 రైతులకు గాను రూ .165.45 కోట్లు,రెండవ విడతగా 18496 రైతులకు గాను రూ. 181.83 కోట్లు ప్రభుత్వం నుండి రైతులకు వచ్చాయని తెలిపారు. అదేవిధంగా బ్యాంక్, వ్యవసాయ శాఖ సిబ్బంది రుణమాఫీ డబ్బులు రైతులకు అందేలా చూడాలని సూచనలు చేశారు. ప్రతి రైతు రుణమాఫీ డబ్బులను పంట పెట్టుబడికి వినియోగించాలని సూచించారు. రూ.1.50 లక్షల వరకు అర్హులైన రైతులకు కలెక్టర్ చెక్కులు అందజేశారు. రైతులకు, అందరికి ధన్యవాదాలు తెలిపారు. జిల్లా వ్యవసాయ అధికారి, ఎల్‌డిఎం(బ్యాంక్) నారాయణపేట రైతులను ఉద్దేశించి రుణమాఫీపై తొందర పడకుండా ఏవైనా సమస్యలు ఉంటే వారి దృష్టికి తీసుకువచ్చినట్లయితే క్షేత్ర సిబ్బంది ద్వారా పరిష్కరిస్తామని చెప్పారు.

పేట డంపింగ్ యార్డ్‌ను పరిశీలన



నారాయణపేట మున్సిపాలిటీకి చెందిన డంపింగ్ యార్డును మంగళవారం కలెక్టర్ సిక్తా పట్నాయక్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మాయంక్ మిత్తల్, ట్రైనీ కలెక్టర్ గరిమానరులతో కలసి పరిశీలించారు. ఈ సందర్భంగా డంపింగ్ యార్డ్‌లో కొనసాగుతున్న తడి చెత్త, పొడి చెత్త నిర్వహణను పర్యవేక్షించారు. నారాయణపేట మున్సిపాలిటీలోని 24 వార్డుల నుంచి రోజుకు ఎంత చెత్త సేకరణ జరుగుతుందని ఎన్ని ట్రాక్టర్లు ఎన్ని ఆటోలు ఉన్నాయని మున్సిపల్ కమిషనర్ సునీతను కలెక్టర్ ప్రశ్నించారు. రోజుకు 18 మెట్రిక్ టన్నుల చెత్తను 4 ట్రాక్టర్లు, 10 ఆటోల ద్వారా డంపింగ్ యార్డ్ కు తరలించడం జరుగుతుందని కమిషనర్ సునీత కలెక్టర్‌కు తెలిపారు. డంపింగ్ యార్డ్‌లో ఇతర వ్యర్థాల నిర్వహణ ఎలా సాగుతోందని అడిగి తెలుసుకున్నారు. పట్టణంలో సేకరించిన చెత్తా చెదారాన్ని యార్డులో వేరు చేస్తున్న తీరును కలెక్టర్ దగ్గరుండి చూశారు. అలాగే ప్లాస్టిక్ వ్యర్థాలతో ఆయిల్‌ను తయారీని, ఇటుకల తయారీని కూడా పరిశీలించారు.

ఇటుకలు, అయిల్‌ను ఎక్కడికి ఎగుమతి చేస్తున్నారని అడిగి తెలుసు కున్నారు. డంపింగ్ యార్డ్‌లో చెత్త నిర్వహణ కోసం స్టాటొ స్ ప్రాజెక్ట్ లిమిటెడ్ అనే సంస్థకు నెలకు రూ.4 లక్షలు చెలిస్తున్నట్లు కమిషనర్ సునీత కలెక్టర్‌కు వివరించారు. చివరగా కలెక్టర్ మానవ వ్యర్థాల నిర్వహణ తీరును కూడా పరిశీలించారు. డంపింగ్ యార్డ్‌లో మొక్కలు నాటారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్, ఇంజనీర్ మహేష్, హెల్త్ అసిస్టెంట్ లు చెన్నకేశవులు, శ్రీనివాస్ జీ పాల్గొన్నారు.

ఈ కార్యక్రమంలో నారాయణపేట మున్సిపల్ చైర్ పర్సన్, వ్యవసాయ శాఖ అధికారి జాన్ సుధాకర్, వ్యవసాయ సహకార సంఘాల అధ్యక్షులు డీసీఎంఎస్ డైరెక్టర్ పీఏసీఎస్ చైర్మన్ పుట్టి ఈదప్ప, బ్యాంక్ మేనేజర్లు, మండల వ్యవసాయ అధికారులు, విస్తరణ అధికారులు, వివిధ గ్రామాల రైతులు పాల్గొన్నారు.

కనీస వేతనం అమలు చేయమంటే అరెస్టులా

- సీఐటీయు జిల్లా కార్యదర్శి బలరాం
- అక్రమ అరెస్టుల పట్ల సీఐటీయు ఖండన







నవతెలంగాణ - నారాయణపేట

ఆశ, గ్రామ పంచాయతీ కార్మికుల కనీస వేతనం అమలు చేయాలని కోరితే రాష్ట్ర ప్రభుత్వం పోలీసుల చేత అర్ధరాత్రి కార్మికుల ఇండ్ల మీదపడి పోలీసులు అక్రమ అరెస్టులకు పాల్పడడం దారుణమని సీఐటీయూ జిల్లా కార్యదర్శి బలరాం విమర్శించారు. మంగళవారం జిల్లా కేంద్రంలో అరెస్ట్ అయిన ఆశ కార్యకర్తలను, గ్రామ పంచాయతీ కార్మికులను పోలీస్ స్టేషన్‌లో పరామర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామ పంచాయతీ కార్మికులు, ఆశ వర్కర్లు కనీస వేతనం కొరకు చలో హైదరాబాద్ బయలుదేరుతున్న వారిని పోలీసులు అక్రమంగా అరెస్టు చేయడం సరైనది కాదన్నారు. ప్రభుత్వ నిర్బంధాన్ని నిరసించారు. ఈ సందర్భంగా పారితోషికం వద్దు ఫిక్స్ వేతనం రూ.18వేల అమలు చేయాలని 15రోజుల సమ్మె సందర్భంగా ప్రభుత్వం ఇచ్చిన హామీలను కాంగ్రెస్ మేనిఫెస్టో పెట్టిన కనీస వేతనం రూ.18వేలు ఆరోగ్య కమీషనర్ ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరుతూ హైదరాబాద్ బయలుదేరుతున్న ఆశలను కార్యకర్తలను, గ్రామ పంచాయితీ కార్మికులను అక్రమంగా అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌లో నిర్బంధించడం అన్యాయమని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామ పంచాయతీ కార్మికులకు మల్టీ పర్పస్ విధానాన్ని రద్దుచేసి జీవో నెంబర్ 51ని ఉపసంహరించుకోవాలని, మున్సిపల్ కార్మికుల వలే కనీస వేతనం జీవో నెంబర్ 60 ప్రకారం రూ.16,600 అమలు చేయాలని కోరుతూ హైదరాబాద్‌లోని ఇందిర పార్కు దగ్గర మహాధర్నకు బయలుదేరుతున్న పంచాయతీ కార్మికుల ఇండ్లకు వెళ్లి అర్ధరాత్రిలో పోలీసులు అరెస్టు చేయడం దారుణమని విమర్శించారు. అరెస్టులతో నిర్బందాలతో ఉద్యోగ కార్మికుల ఉద్యమాన్ని ఆపలేరని ప్రభుత్వం తెలుసుకోవాలని హితవు పలికారు. కేసీఆర్ పదేళ్ల పరిపాలన నిర్బంధాలతోనే సాగిందని అందుకే ప్రజలు బుద్ధి చెప్పారని గుర్తు చేశారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఉద్యోగ కార్మికుల పక్షపాతిక వివరించాలని కోరారు. వారి శ్రమకు వేతనం అమలు చేయాలని డిమాండ్ చేశారు. అరెస్టు అయిన కార్మికులను భేషరతుగా తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అరెస్ట్ అయిన వారిలో మల్లేశ్వరి, పార్వతి, వైశాలి, రాజేశ్వరి, హైమావతి, భాగ్య ఉమా, కృష్ణవేణి, అరుణ, మంజుల, భాగ్యమ్మ, చంద్రకళ, గ్రామపంచాయతీ కార్మికులు వెంకటయ్య, అశోక్, సిద్దు మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు సాయిలు తదితరులు ఉన్నారు.

మహబూబ్‌నగర్ డెస్క్ : ఆశ, గ్రామ పంచాయతీ కార్మికుల కనీస వేతనం అమలు చేయాలని కోరితే రాష్ట్ర ప్రభుత్వం పోలీసుల చేత అర్ధరాత్రి కర్మికుల ఇండ్ల మీద పడి అక్రమఅరెస్టులకు ప్రభుత్వం పాల్పడడం దారుణమని తెలంగాణ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు అశోక్ విమర్శించారు. మంగళవారం మద్దూరు పోలీసు స్టేషన్‌లో తనతో పాటు 12 మందిని ఆశా, గ్రామ పంచాయతీ కార్మికులను అరెస్ట్ చేయడం అన్యాయమన్నారు. ప్రభుత్వ నిర్బంధాన్ని నిరసించారు. అరెస్ట్ అయిన వారిలో మద్దూరు మండల ఆశా యూనియన్ అధ్యక్షురాలు అమృతమ్మ, ఆశా కార్యకర్తలు మహేశ్వరి, జయమ్మ సుధ, నిర్మల, నర్సమ్మ, గ్రామ పంచాయతీ కార్మికులు వెంకటేష్, భీమప్ప, జైనోద్దైన్, తలారి మహిపాల్, నీలి రాములు తదితరులు ఉన్నారు.

మక్తల్ : ఆశ, గ్రామ పంచాయతీ కార్మికుల కనీస వేతనం అమలు చేయాలని కోరితే రాష్ట్ర ప్రభుత్వం పోలీసుల చేత అర్ధరాత్రి కార్మికుల ఇండ్ల మీద పడి అక్రమ అరెస్టులకు పాల్పడడం దారుణమని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి సిఆర్.గోవింద్ రాజ్ విమర్శించారు. మంగళవారం మండల కేంద్రంలోని అరెస్ట్ అయిన ఆశ కార్యకర్తలను, గ్రామ పంచాయతీ కార్మికులను పోలీస్ స్టేషన్‌లో పరామర్శించారు. అరెస్ట్ అయిన వారిలో యస్.పార్వతమ్మ, జి.వెంకటమ్మ, వెంకటలక్ష్మి, కే.సుజాత, యల్.నరసమ్మ, పి.నందిని, కే.పద్మ, యూనియన్ నాయకులు ఉన్నారు.

ప్రమాద రహిత వారోత్సవాలు



నవతెలంగాణ-నారాయణపేట

సంస్థ ఆదేశానుసారం జూలై 24 నుంచి 30 వరకు నిర్వహించిన ప్రమాద రహిత వారోత్సవాలలో భాగంగా మంగళవారం రీజినల్ స్థాయిలో నారాయణపేట డిపో యందు ముగింపు వేడుకలు నిర్వహించారు. ముఖ్య అతిథులుగా మేఘాగాంధీ డీటీఓ నారాయణపేట, విశిష్ట అతిథులుగా వి.శ్రీదేవి రీజనల్ మేనేజర్, డిప్యూటీ ఆర్ఎంఒ/ ఎంటీ ఎస్ఆర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సంస్థలో వారం రోజులపాటు నిర్వహించిన వారోత్సవాలలో ఎలాంటి ప్రమాదాలు లేకుండా నిర్వహించడం శుభసూచకమన్నారు. ట్రాఫిక్ రూల్స్ నియమ నిబంధనలు పాటిస్తూ సంవత్సరంలో 365రోజులు కూడా ఇలాంటి ప్రమాదం జరగకుండా విధులు నిర్వహించాలని డ్రైవర్లను కోరారు. ప్రతి సంవత్సరం జనవరిలో ఒకసారి రోడ్డు భద్రత వారోత్సవాలు, జూలైలో ప్రమాద రహిత వారోత్సవాలు జరుపుకుంటామని తెలిపారు. ఇలా సంవత్సరంలో రెండుసార్లు జరుపుకుంటామన్నారు.

రీజినల్‌లో 32ఏళ్ల విధులు నిర్వహించి ఎలాంటి ప్రమాదం జరగకుండా విధులు నిర్వ హించిన డ్రైవర్లు ఉండడం చాలా గర్వంగా ఉందన్నారు. వీరిలో నారాయణపేట డిపో ఉండడం చాలా సంతోషమైన విషయమన్నారు. ఇలాంటి వారు ఉన్నందువలన సంస్థ బ్రాండ్ అయిన సురక్షిత ప్రయాణం విజయవంతం అవుతుందన్నారు. డిపో మేనేజర్ లక్ష్మీ సుధ మాట్లాడుతూ పేట డిపోలో సంవత్సరంలో ఇప్పటివరకు ఎలాంటి ప్రమాదం జరగకుండా యాక్సిడెంట్ రేటు జీరోగా ఉందని తెలిపారు. ఈ సంవత్సరం అంతా ఇలాగే ఉండడానికి ప్రయత్నం చేస్తామన్నారు. రీజనల్ స్థాయిలో యాక్సిడెంట్ ఫ్రీ అవార్డు సాధించిన వారిలో నారాయణపేట డిపోకు చెందిన మల్లా రెడ్డి 150546, 32ఏళ్ల 6నెలలు, వనపర్తి డిపోకు చెందిన మురళి 280897, 32ఏళ్ల 6నెలలు, కల్వకుర్తి డిపోకు చెందిన నషీరుద్దీన్ 281080, 31ఏళ్ల 10నెలలు ప్రమాద రహిత డ్రైవర్లుగా ఉన్నారు. వీరికి శాలువాతో సన్మానించి ప్రశంస పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో రీజియన్‌లోని అన్ని డిపో మేనేజర్లు, ఎస్టీఐలు, డిపో స్థాయిలో ఎంపికైన డ్రైవర్లు, సూపర్వైజర్లు, డిపో సిబ్బంది ఉన్నారు.0

నేడు హైదరాబాద్‌లో భారీ ధర్నా..

- సెంట్రలైజ్ కిచెన్ ఆలోచన విరమించుకోవాలి
- ఏఐటీయూసీ డిమాండ్
- తరలి రావాలని ఏఐటీయూసీ నేతల విజ్ఞప్తి






నవ తెలంగాణ - ఊట్కూర్

తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ పాఠశాలలో పనిచేస్తున్న 54వేల మంది మధ్యాహ్న భోజన పథకం కార్మికుల ఉపాధికి విఘాతం కలిగించే సెంట్రలైజ్ కిచెన్ విధాన ఆలోచన విరమించుకోవాలని ఏఐటీయూసీ తెలంగాణ రాష్ట్ర మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ రాష్ట్ర నాయకులు పి.వెంకటేష్ అన్నారు. మంగళవారం మండల కేంద్రమైన ఉట్కూర్‌లో జరిగిన సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో అక్షయపాత్ర పేరుతో కార్మికుల ఉపాధిని దెబ్బ తీసే కుట్రను చేసిన కేసీఆర్ ప్రభుత్వ ప్రయత్నాన్ని కార్మికులు తిప్పికొట్టారని, ఫలితంగా 54వేల మంది కార్మికులు ఉపాధి పొందుతున్న తెలంగాణ మధ్యాహ్న భోజన పథకంలో సెంట్రలైజ్డ్ కిచెన్ విధానాన్ని ప్రవేశపెట్టాలని, అందుకు కొడంగల్ నియోజకవర్గాన్ని పైలెట్ ప్రాజెక్టుగా చేయాలని ప్రయత్నం చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వ ఆలోచనలు విరమించుకోవాలన్నారు. గత మూడు దశాబ్దాలుగా వెయ్యి రూపాయల గౌరవ వేతనంతో అప్పులు చేసి పసి పిల్లలకు వంటలు వండి పెడుతున్న కార్మికుల కష్టాలను రాష్ట్ర ప్రభుత్వం గట్టెక్కించాలని ఆయన డిమాండ్ చేశారు. గత ప్రభుత్వ హయాంలో పెరిగిన గౌరవ వేతన జీవోని రూ.10వేలకు పెంచి అమలు చేస్తామని చెప్పిన రాష్ట్ర ప్రభుత్వ హామీని నెరవేర్చాలని, పెరిగిన ధరలకు అనుగుణంగా మెనూ, మెస్ చార్జీలను పెంచాలని, కార్మికులకు డాక్టర్ బీ.ఆర్.అంబేద్కర్ రాసిన రాజ్యాంగ కార్మిక హక్కులైన పీఎఫ్, ఈఎస్ఐ గ్రాట్యుటీ పెన్షన్ బోనస్ తదితర సంక్షేమ పథకాలను వర్తింపజేయాలన్నారు. డ్రెస్ కోడ్‌తో పాటు గుర్తింపు కార్డులను ఇవ్వాలని కోరుతూ నేడు హైదరాబాదులోని ఇందిరా పార్క్ వద్ద ఏఐటీయూసీ తెలంగాణ మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ రాష్ట్ర సమితి ఆధ్వర్యంలో జరిగే ధర్నాను జయప్రదం చేయాలని, సంఖ్యలో హాజరు కావాలని కోరారు. కార్యక్రమంలో పద్మమ్మ మోనమ్మ, అనిత, సునిత, వెంకటన్న, ప్రతాప్ రెడ్డి, జమీర్‌సాబ్, కుప్పయ్య పాల్గొన్నారు

మరికల్ : మండల కేంద్రంలో మంగళవారం తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలలో పని చేస్తున్న మధ్యాహ్న భోజన పథకం కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఏఐటీయూసీ, తెలంగాణ రాష్ట్ర మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో బుధవారం చలో హైదరాబాద్, ఇందిరాపార్క్ దగ్గర జరిగే ధర్నాను జయప్రదం చేయాలని తెలంగాణ మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్, ఏఐటీయూసీ రాష్ట్ర నాయకులు పి.వెంకటేష్ విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో తిమ్మప్ప, అంజనేయులు, భాగ్యమ్మ, వెంకటమ్మ, రాధ, అలివేలు, మణెమ్మ, అంజమ్మ, తదితరుల పాల్గొన్నారు.

జానపద కళాకారుల గ్రామ కమిటీ ఎన్నిక



నవతెలంగాణ-పెద్దకొత్తపల్లి

మండల పరిధిలోని వెన్నచర్ల, చంద్రకల్ గ్రామాలలో రాష్ట్ర జానపద కళాకా రుల అధ్యక్షులు వంగ శ్రీనివాస్ ఆదేశాల మేరకు మంగళవారం గ్రామ కోలాటం, చెక్కభజన తదితర జానపద కళాకారుల సమావేశం చంద్రకలు, వెన్నచర్ల గ్రామాలలో సమావేశాలు ఏర్పాటు చేసి గ్రామ నూతన కమిటీని ఎన్నుకు న్నట్లు జిల్లా జానపద కళాకారుల సంఘం సంయుక్త కార్యదర్శి తుపాకుల వెంకటేష్ ఒక ప్రకటనలో తెలిపారు. వెన్నచర గ్రామంలో నూతన జానపద కళాకారుల గ్రామ కమిటీ అధ్యక్షులుగా గడ్డికోపుల సలేశ్వరం, ప్రధాన కార్యదర్శిగా అవుట్ విష్ణు, ఉపాధ్యక్షులుగా గడ్డికోపుల శ్రీను, డి.నాగరాజు, కోశాధికారిగా జెడ్పి కురుమయ్య సహాయ కార్యదర్శిగా ఎర్రోళ్ల శ్రీను, కార్యవర్గ సభ్యులుగా అవుట వెంకటయ్య పానుగంటి రామకృష్ణ, గిరి రాములు, తలారి కురుమయ్య, మద్దిలేటి, అవసలి కుంట మల్లయ్య శివ, జంగం నడిపిరాములు, నాగరాజులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఆయన తెలిపారు. అదేవిధంగా చంద్రకల్ గ్రామ జానపద కళాకా రుల సంఘం అధ్యక్షులుగా పెద్ద సుందరయ్య, ప్రధాన కార్యదర్శిగా ఎదుర పెళ్లి కురు మయ్య ఉపాధ్య క్షులుగా బండి కురుమయ్య గడ్డం కృష్ణయ్య, కోశాధికారిగా మన పట్ల శేఖర్, సంయుక్త కార్యదర్శిగా కొనమోని శేఖర్ లింగయ్య ,సురేష్ బావనపల్లి లింగయ్య, కే సురేష్, బాలస్వామి, గడ్డం రాము, పర్వతాలు, కార్యవర్గ సభ్యులుగా బిజీ.వెంకటస్వామి, కలుమూరి వెంకటయ్య, వనపట్ల రాముడు, బండి చెన్నయ్య, ఎదిరపల్లి చింతలయ్య, గడ్డం బంగారయ్యలను ఏకగ్రీవంగా ఎన్నుకు న్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంయుక్త కార్యదర్శి పన్నీరు మల్లేష్, కాటమోని నరసింహ, జిల్లా నాయకులు విజ్జి శ్రీనివాసులు, పెద్దకొత్తపల్లి మండల అధ్యక్షులు బిళ్లే ఎల్లయ్య, ప్రధాన కార్యదర్శి కేశవులు ఉన్నారు.

అధ్వానంగా.. పిడెంపల్లి రోడ్డు

- ఇబ్బందుల్లో పాదచారులు
- రోడ్డు వేయాలని గ్రామస్తుల వేడుకోలు

నవతెలంగాణ - నారాయణపేట

నారాయణపేట జిల్లా దామరగిద్ద మండ లంలోని పిడెంపల్లి గ్రామ రైస్‌మిల్ నుంచి పీడేంపల్లి గ్రామం వరకు 3కి.మీ. రోడ్డు బురదమయంగా మారింది. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు రోడ్డు చిత్తడి చిత్తడిగా మారడంతో గ్రామ ప్రజలకు రాక పోకలకు చాలా ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితి నెలకొంది. చినుకులు పడ డంతో రోడ్డు బురదమయంగా మారుతోంది. దీంతో అత్యవసర పనుల నిమిత్తం జిల్లా కేంద్రానికి వచ్చిపోయేందుకు ఇబ్బం దికరంగా ఉంటుందని గ్రామ ప్రజలు వాపోతున్నారు. గత ప్రభుత్వంలో గ్రామ ప్రజలు పలుమార్లు ఎమ్మెల్యే దృష్టికి రోడ్డు విషయం తీసుకెళ్లిన పట్టించు కోవడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. గత బీఆర్ఎస్ ఎమ్మెల్యే ఈ రోడ్డు విషయం పట్టించుకోలేదని, ఇకనైనాతఈ బురద మయమైన రోడ్డును బాగు చేసేందుకు ప్రస్తుత ఎమ్మెల్యే డాక్టర్ చిట్టెం పర్నికరెడ్డి పనులు ప్రారంభించాలని గ్రామస్తులు కోరుతున్నారు. ఎన్నికల సమయంలో ప్రస్తుత ఎమ్మెల్యే ఎమ్మెల్యేగా గెలిచిన రెండు నెలల లోపే రోడ్డును బాగు చేస్తానని హామీ ఇచ్చారని గెలిచి ఎనిమిది నెలలు కావస్తున్న ఇదివరకు రోడ్డు పనులు ప్రారంభించలేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎమ్మెల్యే పర్ణికరెడ్డి రైస్ మిల్ నుంచి పీడెం పల్లికి రోడ్డు వేస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు.



నవతెలంగాణ

సమగ్ర తెలుగు దినపత్రిక

5

జోగులాంబ-గద్వాల

బుధవారం | జూలై 31, 2024 | www.navatelangana.com

రైతు రుణమాఫీ ..

మలివిడత నిధులు విడుదల



నవ తెలంగాణ - జోగులాంబ గద్వాల

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న రైతు రుణమాఫీ-2024 మలివిడత నిధుల విడుదల మంగళవారం అట్టహాసంగా నిర్వహించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి రాష్ట్ర సచివాలయం నుంచి ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, వ్యవసాయ శాఖా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, మంత్రులు, ఉన్నతాధికారులతో కలిసి రుణమాఫీ నిధులను విడుదల చేశారు. కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ అందరం నుంచి కలెక్టర్ బీ.ఎం. సంతోష్ అధ్యక్షతన లబ్ధిదారులైన రైతులు, వ్యవసాయ, సహకార శాఖల అధికారులు, బ్యాంకర్లు, ప్రత్యక్ష ప్రసారం ద్వారా ఈ కార్యక్రమాన్ని వీక్షించి, ముఖ్యమంత్రి సందేశాన్ని తిలకించారు. ఈ సందర్భంగా అధికారులతో కలిసి కలెక్టర్ లబ్ధిదారులైన పలువురు రైతులకు రెండవ విడత రుణమాఫీకి సంబంధించిన చెక్కులను లాంఛనంగా అందజేశారు. ఈ సందర్భంగా రైతులనుద్దేశించి కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రుణమాఫీ కింద జిల్లా రైతుల ఖాతాలలో రూ.174.73 కోట్లు జమ చేస్తోందని అన్నారు. ఇందులో భాగంగా మొదటి విడతగా ఈ నెల 18న లక్ష రూపాయలలోపు రుణాలను మాఫీ చేయగా మలివిడతగా ప్రస్తుతం రూ. లక్షా 50 వేలలోపున్న రైతు రుణాలను మాఫీ చేస్తూ నిధులు విడుదల చేసినట్లు పేర్కొన్నారు. రుణమాఫీ ద్వారా జిల్లాలో మొదటి విడతలో 24398 మంది రైతు కుటుంబాలకు రూ. 144.09 కోట్ల మేర లబ్ధి చేకూర్చగా మలివిడతలో 18141 మంది రైతు కుటుంబాలకు రూ. 174.73 కోట్ల నిధులను వారి ఖాతాలలో ప్రభుత్వం జమ చేసిందని కలెక్టర్ వివరించారు. రైతాంగ ప్రయోజనాలే పరమావధిగా ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న రుణమాఫీ కార్యక్రమం జిల్లాలో ఎలాంటి ఆటంకాలు లేకుండా సాఫీగా జరిగేలా అధికార యంత్రాంగం తరపున అవసరమైన అన్ని చర్యలు తీసుకున్నామని తెలిపారు. అయినప్పటికీ ఎక్కడైనా క్షేత్రస్థాయిలో రైతులకు రుణమాఫీ విషయంలో ఇబ్బందులు ఉంటే వాటిని పరిష్కరించేందుకు ఫిర్యాదులను స్వీకరించి ప్రతి ఒక్క రైతుకు ప్రయోజనం చేకూరేలా చర్యలు చేపట్టడం జరుగుతుందని, అర్హులైన ప్రతి రైతు ప్రయోజనం పొందేలా బ్యాంకర్లు, వ్యవసాయ అధికారులు అన్నదాతలకు తోడ్పాటును అందించాలని ఆదేశించారు. ఏ ఒక్క రైతు అసౌకర్యానికి గురికాకుండా చూడాల్సిన బాధ్యత క్షేత్రస్థాయి అధికారులదేనని స్పష్టం చేశారు.తొలి, మలి విడతలలో రుణమాఫీ పొందిన రైతులందరికీ జిల్లా యంత్రాంగం తరపున కలెక్టర్ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి గోవింద్ నాయక్ , జిల్లా సహకార శాఖ అధికారి ప్రసాద్ రావు, లీడ్ బ్యాంకు మేనేజర్ అయ్యప్ప రెడ్డి, సంబంధిత వ్యవసాయ శాఖ అధికారులు, సహకార సంఘం అధ్యక్షులు, ప్రజాప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.

కల్తీ కల్లు విక్రయిస్తే కటిన చర్యలు

- ఎస్పీ శ్రీనివాసరావు



నవ తెలంగాణ - జోగులాంబ గద్వాల

జిల్లా లో లైసెన్స్ పొంది ఉన్న కల్లు దుకాణాల్లో కల్తీ జరగకుండా చూడాలని, కల్తీ కల్లు ను అమ్మే వారి పై కఠినంగా వ్యవహరించి కేసులు నమోదు చేయాలని ఎస్పీ టీ శ్రీనివాస రావు ఎక్సైజ్, పోలీస్ అధికారులను ఆదేశించారు. మంగళవారం జిల్లాలో లైసెన్స్ పొంది నడుస్తున్న కల్లు దుకాణాలలో కల్తీ జరగకుండా తీసుకోవాల్సిన చర్యల పై ఎస్పీ తన ఛాంబర్ లో పోలీస్, ఎక్సైజ్ అధికారులతో కో ఆర్డినేషన్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా లో గద్వాల్ ,ఆలంపూర్ నియోజక వర్గలలో అనుమతి తో నడుస్తున్న కల్లు దుకాణాల వివరాలు, కల్తీ జరిగేందుకు అవకాశం ఉన్న అంశాలు, ఇతర వివరాలు ఎక్సైజ్ అధికారులు ఎస్పీకి వివరించారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ జిల్లా లోని కల్లు దుకాణాలలో కల్తీ జరగకుండా కఠినంగా వ్యవహరించాలని, అందుకు పోలీస్ శాఖ సహకారం ఉంటుందని, పోలీస్ ,ఎక్సైజ్ అధికారులు సమన్వయంతో జిల్లాలో కల్తీ కల్లు సరఫరా , రవాణా, వినియోగ నివారణకు కృషి చేయాలని అన్నారు. రెగ్యులర్‌గా కల్లు దుకాణాలలో, కల్లు డిపోలలో తనిఖీలు చేపట్టాలని, అనుమానం ఉండే దుకాణాలలో శాంపిల్స్‌ను సేకరించి ల్యాబ్ పరీక్షల ద్వారా కల్తీ కల్లును గుర్తించాలని, అలగే అందుకు కారకులైన వారి పై కఠినంగా వ్యవహరించి కేసులు నమోదు చేయాలని, అనుమతి లేని కల్లు దుకాణాలు ఎట్టి పరిస్థితులలో నడవకుండా నిఘా ఉంచి నియంత్రించాలని అధికారులను ఆదేశించారు. ఈ సమీక్షలో డీఎస్పీ సత్యనారాయణ, గద్వాల్, ఆలంపూర్, శాంతి నగర్ సీఐలు భీమ్ కుమార్, రవి బాబు, టాటా బాబు, గద్వాల్,ఆలంపూర్ ఎక్సైజ్ సిఐలు గణపతి రెడ్డి, హన్మ నాయక్, ఎస్సై లు వెంకటేష్, వీరేష్‌లు పాల్గొన్నారు.

చెరుకు రైతుల సమస్యలను పరిష్కరించాలని..

సీఎం రేవంత్ రెడ్డికి వినతి



నవతెలంగాణ- అమరచింత

మహబూబ్‌నగర్ ఉమ్మడి జిల్లాలో చెరుకు పండిస్తున్న రైతుల సమస్యలను పరిష్కరించాలని కృష్ణవేణి రైతు సంఘం నాయకులు సీఎం రేవంత్‌రెడ్డిని కోరారు. మంగళవారం చెరుకు రైతు సంఘం ఆధ్వర్యంలో హైదరాబాదులో సీఎం రేవంత్ రెడ్డిని కలిశారు. ఈ సందర్భంగా ఉమ్మడి జిల్లాలోని కృష్ణవేణి చెరుకు ఫ్యాక్టరీ యాజమాన్యం చెరుకు రైతులకు చేస్తున్న దోపిడీ గూర్చి సీఎంకు కృష్ణవేణి చెరుకు రైతు సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు కే. రాజన్న సీఎంకు వివరించినట్లు తెలిపారు. చెరుకు పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని, చెరుకు కోతల సమయంలో లేబర్ బంటాల సమస్య తీవ్రంగా ఉందని సీఎంకు వివరించారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వంలో చెరుకు రైతులకు సబ్సిడీలను ఎత్తివేయడం ద్వారా రైతులు అనేక ఇబ్బందులకు గురవుతున్నారని వివరించారు. తమిళనాడు, కర్ణాటక, మహారాష్ట్ర, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాలలో చెరుకు రైతులకు ప్రభుత్వపరంగా మద్దతు ధరను టన్నుకు వెయ్యి రూపాయలు బోనస్ ఇచ్చి రైతులను ఆదుఆదుకుంటుందని, అలాగే తెలంగాణ రాష్ట్రంలోని చెరుకు రైతులకు బోనస్ ను ఇచ్చి ఆదుకోవాలని సీఎం కు కోరారు. చెరుకు రవాణా నిమిత్తం కొత్తకోట మండల పరిధిలోని ముమ్మాలా పల్లి నుంచి పరిశ్రమ దాకా డబుల్ బీటి రోడ్డును వేయాలని డిమాండ్ చేశారు. చెరుకు రైతులకు సమస్యలను అన్నిటిని పరిష్కరిస్తానని, ప్రభుత్వపరంగా బోనస్ కు కూడా ఇచ్చేటట్లు ఏర్పాటు చేస్తానని రైతులకు హామీ ఇచ్చినట్లు కే రాజన్న తెలిపారు. అనంతరం హైదరాబాదులోని రాష్ట్ర పరిశ్రమల శాఖ కమిషనర్ మల్సూర్, కేన్ డిప్యూటీ కమిషనర్ నర్సిరెడ్డిలను కలిసి చెరుకు రైతల సమస్య సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ వినతిపత్రం సమర్పించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కృష్ణవేణి చెరుకు రైతు సంఘం ఉమ్మడి జిల్లా ఉపాధ్యక్షుడు వాసారెడ్డి, సహాయ కార్యదర్శి నారాయణ, వెంకటేశ్వర్ రెడ్డి, జిల్లా కమిటీ సభ్యులు చంద్రసేనారెడ్డి, రాజశేఖర్ రెడ్డి, అరుణ్ కుమార్, బీ రాజు, సంజీవరెడ్డి, రంగారెడ్డి, వీరన్న, తిరుపతయ్య, ఆత్మకూర్ జోన్ కమిటీ నాయకులు మ్యాదరి శ్రీనివాసులు, గోవిందు, అలీ, చెన్నారెడ్డి, రామాంజనేయులు, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రధానోపాధ్యాయుడికి ఘన సన్మానం



నవ తెలంగాణ - గట్టు

ఎంపీపీఎస్ బాలుర గట్టు పాఠశాలలో నిర్వహించిన జెడ్పీహెచ్ఎస్ కాంప్లెక్స్ సమావేశంలో పాఠశాలకు ప్రధానో పాధ్యాయులుగా పదోన్నతిపై నూతనంగా వచ్చిన నల్లారెడ్డిని శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్ర మంలో సీనియర్ ఉపాధ్యాయులు చంద్రకాంత్ వదన్ , హనుమంత్ నాయక్ , బాలరాజు ,రామన్ గౌడ్ , సీనియర్ సీ ఆర్ పీలు రాంబాబు ,కులదీప్ నయ్యర్ , శశికల , కాంప్లెక్స్ ఉపాధ్యాయులు, వాలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

2013 భూ సేకరణ చట్టం ప్రకారం..

నష్టపరిహారం చెల్లించాలి

- ఆర్బిట్రేషన్ ప్రక్రియ వెంటనే పూర్తి చేయాలి
- రెండవ విడత భూసేకరణ సందర్భంగా ఇచ్చిన అవార్డు ప్రకారం మొదటి విడత రైతులకు నష్టపరిహారం పెంచి ఇవ్వాలి
- మాజీ ఎమ్మెల్యే, తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు నంద్యాల నరసింహారెడ్డి

నవతెలంగాణ - జోగులాంబ గద్వాల

భారత్ మాల రోడ్డు నిర్మాణంలో భూములు కోల్పోయిన రైతులందరికీ 2013 భూసేకరణ చట్టం ప్రకారం.. నష్టపరిహారం చెల్లించాలని రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు మాజీ ఎమ్మెల్యే నంద్యాల నరసింహారెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక వాల్మీకి కమ్యూనిటీ హాల్లో రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు జీకే ఈదన్న అధ్యక్షతన జరిగిన నిర్వాసిత రైతుల జిల్లా సదస్సుకు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. అనంతరం కలెక్టర్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి కార్యాలయం ఎదుట బైఠాయించి ధర్నా నిర్వహించారు. అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2013 భూసేకరణ చట్టం ప్రకారం భూమికి బహిరంగ మార్కెట్లో ఉన్న ధరకు అదనంగా ఇవ్వాలని ముందుగా రైతులందరితో సమావేశాన్ని ఏర్పాటు చేసి వారి అభిప్రాయ సేకరణ మేరకే భూమి తీసుకోవాలని.. కానీ చట్ట ప్రకారం కాకుండా రైతులను భయభ్రాంతులకు గురిచేసి భూమిని లాక్కున్నారని విమర్శించారు. భారత్ మాల రహదారి నిర్మాణంలో భూములతో పాటు బావులు బోర్లు పైపులైన్లు, చెట్లు కోల్పోయిన రైతులకు నష్టపరిహారం పెంచి ఇవ్వాలని చట్టం చెబుతున్నదని , కానీ ఇవేమీ పాటించకుండా రైతుల జీవనా ధారమైన భూమిని లాక్కొని రైతులను నిరాశ్రయులను చేయడం పట్ల అధికారుల నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తుందని విమర్శించారు. భారత్ మాల రహదారి నిర్మాణంలో భూములు కోల్పోయిన రైతులకు ఆర్బిట్రేషన్ ప్రక్రియను వెంటనే పూర్తి చేసి రెండవ విడత భూసేకరణ సందర్భంగా ఇచ్చిన అవార్డు ప్రకారం.. మొదటి విడత భూములు కోల్పోయిన రైతులకు నష్టపరిహారం పెంచి ఇవ్వాలని డిమాండ్ చేశారు. భూములు కోల్పోయిన రైతులకు భూమికి సమానంగా భూమి కుటుంబానికి ఉద్యోగం, భూమి అందించే వరకు ఆ కుటుంబానికి పోషణ తదితర అనేక రక్షణలు చట్టంలో పేర్కొన్న ఎందుకు చట్టాన్ని అనుసరించి రైతులకు న్యాయం చేయలేదని ప్రశ్నించారు. జిల్లాలో ఆరు మండలాల పరిధిలోని 19 గ్రామాలలో రైతుల నుంచి రెండు విడుతలగా దాదాపు 800 ఎకరాల భూమి సేకరించినా వారికి తగిన నష్టపరిహారం ఇవ్వకుండా ప్రభుత్వ కార్యాలయం చుట్టూ తిప్పడం సరికాదన్నారు. రైతుల పొలాలకు వెళ్లడానికి భారత్ మాల రహదారికి ఇరువైపులా సర్వీస్ రోడ్లు వేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బ్రిడ్జీల నిర్మాణం కూడా చాలా తక్కువ ఎత్తులో నిర్మించారని దీంతో రైతుల వ్యవసాయ ఉత్పత్తుల రవాణాకు తీవ్ర ఆటంకం ఏర్పడుతుందని, ఎత్తు పెంచి బ్రిడ్జీల నిర్మాణం చేయాలని డిమాండ్ చేశారు. ధర్నా అనంతరం రైతులతో కలిసి కలెక్టర్‌కు వినతిపత్రం అందించారు. కలెక్టర్ స్పందిస్తూ నష్టపరిహారం అమౌంట్ పెంచి ఇవ్వడం కోసం ప్రతిపాదనలు ఉన్నతాధికారులకు పంపించామని, నెల లోపు రైతులందరికీ నష్టపరిహారం వస్తుందని తెలిపారు. సర్వీస్ రోడ్ల ఏర్పాటుకు ఉన్న అవకాశాలను క్షేత్రస్థాయిలో వచ్చి పరిశీలన చేసి ప్రతిపాదనలు పంపుతామని తెలిపారు. రైతులు కోల్పోయిన బావులు , బోర్లు పైపులైన్లు ,చెట్లకు అధికారుల నుంచి రిపోర్టులు తెప్పించుకొని పరిశీలిస్తానని అన్నారు. రైతుల ధర్నా వద్దకు సెక్షన్ సూపరింటెండెంట్ నరేష్ వచ్చి కలెక్టర్ తరపున హామీ ఇచ్చారు. అనంతరం రైతు సంఘం నాయకులు మాట్లాడుతూ నెలరోజుల లోపు సమస్యలు పరిష్కరించాలని, లేనిచో నెల తరువాత వివిధ రకాల ఆందోళనలు చేపడ్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బొంతల చంద్రారెడ్డి, రాష్ట్ర సహాయ కార్యదర్శి డీ. బాల్ రెడ్డి, కర్ణాటక ప్రాంత రైతు సంఘం రాయచూరు జిల్లా అధ్యక్షులు వీరన్న గౌడ, సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి ఏ. వెంకటస్వామి, తెలంగాణ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు జీకే ఈదన్న, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు ఉప్పేరు నరసింహ, గట్టన్న, రైతులు అంపేష్, శేఖర్, లోకేశ్వర్ రెడ్డి, అనంతరెడ్డి , కృష్ణారెడ్డి, చాకలి శ్రీనివాసులు, మంగళ సుధాకర్, తిరుపతి రెడ్డి, మల్లేష్ తో పాటు వివిధ మండలాల రైతులు దాదాపు 400 మంది పాల్గొన్నారు.







కాంగ్రెస్ అప్రజాస్వామిక పాలన అంతం కావాలి

- ఉద్యోగ ,ఉపాధ్యాయ ,పెన్షనర్స్, విద్యార్థి,ప్రజా సంఘాలు



నవతెలంగాణ - జోగులాంబ గద్వాల

ప్రజలు, విద్యార్థుల నుంచి ఉద్యోగ ఉపాధ్యాయ పెన్షనర్ల దాకా తెలంగాణా రాష్ట్రంలోని వివిధ రంగాల్లోని అశేష ప్రజానీకం తమ దీర్ఘకాలిక అపరిష్కృత సమస్యల పరిష్కారం కోసం గొంతెత్తకుండా నిర్బంధాన్ని అమలు చేయడంలో పాలక పార్టీ ఏదైనా ఒకటే అనీ.. తెలంగాణా ఇచ్చింది మేమే అంటూ గొప్పలు చెప్పుకొని తెలంగాణలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ ఆర్నెల్లు తిరక్కుండానే తన ప్రజా కంటక నిజ స్వభావాన్ని బైట పడేసుకున్నదనీ.. పోరాడే ప్రజలు భ్రమలు పెంచుకోకుండా అప్రమత్తంగా ఉండాలని తెలంగాణా రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘం మంగ ళవారం హెచ్చరించింది. ఇటీవల విద్యార్థులు చేసిన ఉద్యమంపై హింసాయుత పోలీసు దాడికి పాల్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం డీఏలు,హెల్త్ కార్డులూ , నగదు రహిత చికిత్స లాంటి తమ దీర్ఘకాలిక సమస్యల పరిష్కారానికి మూడునెలల ముందే దశలవారీ ఆందోళన కార్యక్రమాలు ప్రకటించిన తెలంగాణా పెన్షనర్ల జేఏసీ ఈ రోజు హైదరాబాద్లో జరుప తలపెట్టిన రాష్ట్ర వ్యాపిత మౌన దీక్షకు పర్మిషన్ ఇవ్వకుండా.. ఇచ్చినా చివరి దశలో.. రెండు గంటలు(మ.1 - 3గం.వరకే) మాత్రమే.. అదీ పరిమిత సంఖ్యలో మౌన దీక్ష చేసి ముగించాలని ఆంక్షలు విధించడం అత్యంత హేయమైన చర్య అని అన్నారు. ఈ దుర్మార్గ దుడుకు స్వభావం వీడాలనీ.. లేనిచో ప్రజా ఉద్యమాలు పెల్లుబికి అప్రజాస్వామిక పాలన అంతం చేస్తాయని రాష్ట్రప్రభుత్వానికి పెన్షనర్ల జేఏసీ జిల్లా నాయకుడు ఎండీ. ఇక్బాల్ పాషా హితవు పలికారు. రాష్ట్ర రాజధానిలో జరిగే మౌన దీక్షకు తరలి వస్తున్న వివిధ జిల్లాల పెన్షనర్ల వాహనాలను పోలీసులచే అడ్డగించి నిలువరించడం ఏ రకమైన ప్రజాస్వామ్యమవుతుందో చెప్పాలనీ.. బహిరంగ ప్రజా గొంతు వేదిక ధర్నాచౌక్ ను రద్దు చేసిన గత పాలకులకు పట్టిన దుర్గతి కాంగ్రెస్ పాలనకు పట్టకూడదంటే తక్షణం ఇలాంటి దుర్మార్గ ఆంక్షలు రద్దు చేసుకొని మనసు గాయపడ్డ లక్షలాది పెన్షనర్లకు బహిరంగ క్షమాపణ చెప్పాలనీ.. స్టేట్ గవర్నమెంట్ పెన్షనర్స్ గద్వాల జిల్లా అధ్యక్షుడు ఎండీ.అబ్దుల్ బాబు , జిల్లా ప్రధాన కార్యదర్శి శంకర ప్రభాకర్ స్థానిక అంబెద్కర్ సర్కిల్ కార్యాలయ ఆవరణలో జరిగిన ప్రెస్ మీట్లో డిమాండ్ చేశారు.

ముందస్తు అరెస్టులు అప్రజాస్వామికం : సీఐటీయూ



నవతెలంగాణ - ఉండవల్లి

ఆశా వర్కర్ల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ చలో హైదరాబాదు కార్యక్రమంలో భాగంగా ఆశా వర్కర్లను, సీఐటీయూ నాయకులను అరెస్ట్ చేయడం అప్రజాస్వామికం అని సీఐటీయూ మండల అధ్యక్షుడు వెంకటేశ్వర్లు అన్నారు. మంగళవారం ఆశా వర్కర్లను, సీఐటీయూ నాయకులను అరెస్ట్ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ న్యాయమైన డిమాండ్ల ను అడగడం తమ హక్కు అని పోలీసులు ముందస్తు అరెస్టు చే యడం సరికాదని అన్నారు. గత ప్రభుత్వాలు ఆశా వర్కర్లను మోసం చేసుకుంటూ వచ్చా యని , కనీస వేతనాన్ని కూడా నోచుకోని దుస్థి తిలో ఆశా వర్కర్లు పనిచేస్తున్నారన్నారు. కాం గ్రెస్ ప్రభుత్వంలో న్యాయం చేయాలని వారు కోరారు. చాలీచాలనీ వేతనాలతో కుటుంబ పోషణ భారమై ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటూ అనేక బాధలతో బాధ్యతలు నిర్వహిస్తున్న పట్టించుకోవడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. పల్స్ పోలియో కార్యక్రమాలు కాన్పులు ఆరోగ్య ప్రదాతగా అనేక సేవలందిస్తున్న ఆశావర్కర్లను గుర్తింపు ఇవ్వడం లేదని వాపోయారు. ఆశావర్కర్లకు రూ. 18000 ఫిక్స్ వేతనం, ప్రతి నెల రెండో తేదీన జీతాలు, ప్రభుత్వ ఆసుపత్రిలో రెస్ట్ రూంలు, పీ ఆర్ సీ ఏరియల్ సర్వే తదితర డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని కోరారు. మాషా పోగు వెంకటేశ్వర్లు , సీఐటీయూ మండల అధ్యక్షులు, ఆశా వర్కర్లు బిసమ్మ , రేణుక , చెన్నమ్మ పోలీసులు ముందస్తు అరెస్ట్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించి సొంత పుచ్చికత్తులపై విడుదల చేశారు. ఎస్ఐ శ్రీనివాసు నాయక్. ఏఎస్ఐ సుబ్బారెడ్డి , ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

సెల్ ఫోన్ల రికవరీ..



నవతెలంగాణ -పెబ్బేరు

పెబ్బేరు పట్టణమునందు చోరీకి గురైన మూడు సెల్ ఫోన్‌లను రికవరీ చేసి మంగళవారం బాధితులకు అప్పగించినట్లు ఎస్ఐ హరిప్రసాద్ రెడ్డి తెలిపారు. వీటిని రికవరీ చేయడానికి కృషి చేసిన కానిస్టేబుల్ ఆనంద్‌ను ఎస్సై అభినందించారు. ఎవరైనా ఫోన్ పోగొట్టుకున్నా, చోరీకి గురి అయినా వెంటనే పోలీస్ స్టేషన్‌ను సంప్రదించాలని ఆయన సూచించారు.

జూరాలకు భారీ వరద .. 39 గేట్లు ఎత్తివేత

- కొనసాగుతున్న విద్యుత్ ఉత్పత్తి



నవ తెలంగాణ - ధరూరు

ప్రియదర్శని జూరాల ప్రాజెక్టులో సోమ వారం అధికారుల సమాచారం మేరకు.. ఆల్మట్టి నారాయణపూర్ డ్యాంల నుంచి భారీ ఎత్తున జూరాలకు వరద నీరు వచ్చి చేరుతోంది. అదే తరుణంలో జూరాలకు ఎగువ ప్రాంతం నుంచి ఇన్ ఫ్లో 2 లక్ష 95 000 వేల క్యూస్సెన్ రాగా జూరాల ప్రాజెక్టులో 39 గేట్ల ద్వారా 2లక్ష 85 వేల 434 క్యూసెక్కుల నీటి ని గేట్ల ద్వారా శ్రీశైలం జలాశయంలోనికి వదులుతున్నారు. జల విద్యుత్ కేంద్రం ద్వారా 5 యూనిట్ల నుంచి 19వేల 653 క్యూసెక్కుల తీరును పవర్ నుంచి వదులుతున్నారు. జూరాల ప్రాజెక్టులు నీటిమట్టం 318. 516 నీటి మట్టం ఉండగా బరగనీరు కిందికి వెళ్లడంతో ప్రస్తుతం నీటి నిల్వ 316.770 ప్రస్తుతం కొనసాగుతుంది. 4.340టీఎంసీల వాటర్ నుంచుకొని దిగువ ప్రాంతానికి నెట్టెంపాడుకు 750 బీమా వన్ 750 లెఫ్ట్ బీమా2 లిఫ్టు 650 లెఫ్టు కెనాల్‌కు 820 రైట్ కెనాలకు 658 క్యూసెక్కుల నీటిని కెనాలకు వదులుతున్నారు. ప్రాజెక్టు మొత్తం మీద దిగువ ప్రాంతానికి 3 లక్ష 31 వేల 520 క్యూసెకల నీటిని శ్రీశైలం జలాశయంలోనికి వదులుతున్నట్లు పీజేపీ అధికారులు తెలిపారు.

రుణమాఫీ చారిత్రాత్మకం

- యువజన కాంగ్రెస్ జిల్లా నాయకులు శీను



నవ తెలంగాణ - గట్టు

రైతు రుణమాఫీ చారిత్రాత్మకం అని జోగులాంబ గద్వాల జిల్లా యువజన కాంగ్రెస్ జిల్లా నాయకులు, శీను అన్నారు. తెలంగాణ ప్రభుత్వం రెండో విడత రుణమాఫీకి సిద్ధమైంది, ర్యైతులు ఎంతో మంది ఎదురు చూస్తున్న రెండో విడత రుణమాఫీ నిధులను విడుదల చేసేందుకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, వ్యవసా యశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావుతో కలిసి అసెంబ్లీ ఆవరణలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు పేర్కొన్నారు. రెండో విడతలో దాదాపు 7 లక్షల మంది రైతులకు దాదాపు రూ.7 వేల కోట్ల రుణాలను మాఫీ చేయనున్నారన్నారు. మొత్తం మూడు విడతల్లో రుణమాఫీని పూర్తి చేస్తామని సీఎం ప్రకటించినట్లు వెల్లడించారు. ప్రభుత్వం రూపొందించిన నిబంధనల ప్రకారం మొదటి విడత సందర్భంగా రుణాల ను మాఫీ చేశారని అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన రుణమాఫీ ఇది చరిత్రలో ఎప్పుడు మరిచిపోలేనిదని కాంగ్రెస్ పార్టీకి రైతులు రుణపడి ఉంటారని అన్నారు.